1St Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 3 సంచిక : 81 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ గురువారం 26 మార్చి 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు,నెల్లూరు

VOLUME : 03 ISSUE : 81 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE,NELLORE Thursday 26 March 2026 PAGES : 8 PRICE : 3/-

## ఎంత చెప్పినా మారరా?



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 25)

కొందరు ప్రజాప్రతినిధులపై అవినీతి ఆరోపణలు ఎక్కువగా ఉన్నాయని, ఎంత చెప్పినా వారిలో మార్పు రావట్లేదని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆరోపణలపై సీఎం చంద్రబాబు హెచ్చరించే వరకు పరిస్థితిని ఎందుకు తెచ్చుకుంటున్నారని నిలదీశారు. మంగళవారం విజయవాడలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీలతో సమావేశం సందర్భంగా పలువురి తీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. 'కొందరు ఎమ్మెల్యేలు పరిశ్రమల్లో జరిగే ప్రమాదాల్ని బూచిగా చూపి బెదిరిస్తున్నారు. ప్రజాప్రతినిధులు వసూళ్లు చేస్తున్నారని పరిశ్రమల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్రానికి పరిశ్రమలు తేవడానికి ఎంతో కష్టపడుతున్నాం. మిమ్మల్ని నమ్మి టికెట్లు ఇచ్చాం. ఇలా చేస్తే పార్టీ గౌరవానికి భంగం కలిగించిన వారవుతారు' అని స్పష్టం చేశారు.

సభ్యత్వంలో ఎందుకు వెనకబడుతున్నారు?

కొందరు ప్రజాప్రతినిధులు పార్టీ సభ్యత్వంలో వెనకబడటంపై పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. 'ఎందుకు చేయలేకపోతున్నారు? ఎన్నికల్లో ఎక్కువ టికెట్లు అడగాలంటే సభ్యత్వం మరింత పెరగాలి. సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి' అని సూచించారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్‌పై ఎందుకీ నిర్లక్ష్యం?



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 25)

ప్రైవేట్ స్టీల్ ప్లాంట్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూపుతున్న శ్రద్ధ.. విశాఖ ఉక్కు కర్మాగారంపై ఎందుకు చూపడం లేదని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ప్రశ్నించారు. మిత్తల్ స్టీల్ ప్లాంట్ స్థాపనను స్వాగతిస్తూనే... ఆ సంస్థకు రూ.25 వేల కోట్ల రాయితీలు ఇవ్వడాన్ని ఆమె ఆక్షేపించారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో మంగళవారం షర్మిల విలేకరులతో మాట్లాడారు. '32 మంది బలిదానాలతో, వేల మంది భూములను ▶మిగతా 2లో

## ఇది తెదేపా 3.0 వెర్షన్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 25)

ఇప్పుడు ఉన్నది తెదేపా 3.0 వెర్షన్ అని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్ అన్నారు. తెదేపా అంటేనే నాయకుల తయారీ కార్ఖానా, ఒక యూనివర్సిటీ లాంటిదని తెలిపారు. తెలంగాణ తొలి, రెండో ముఖ్యమంత్రి ఇద్దరిదీ ఈ యూనివర్సిటీయేనని గుర్తు చేశారు. మంగళగిరిలోని తెదేపా ప్రధాన కార్యాలయంలో పార్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌ల శిక్షణా తరగతుల్లో భాగంగా 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో లోకేశ్ మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేసే వారిని మధ్యవర్తులతో ▶మిగతా 2లో

# చంద్రబాబుకు భయపడొద్దు.. ఆ రోజులు పోయాయి: జగన్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 25)



వైసీపీ అధినేత జగన్ ప్రకాశం జిల్లా అద్దంకి నియోజకవర్గ పార్టీ నేతలతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై, ముఖ్యంగా సీఎం చంద్రబాబుపై ఆయన నిప్పులు చెరిగారు. పాలనలో అంతా తనదే అన్నట్టుగా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని, ప్రతి చిన్న విషయంలో 'క్రెడిట్ చోరీ' చేస్తున్నారని మండిపడ్డారు.ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ మన హయాంలోనే రాష్ట్రానికి వచ్చిందని, కానీ ఇప్పుడు తన వల్లే వచ్చినట్టుగా చంద్రబాబు 'బిల్డప్' ఇస్తున్నారని జగన్ ఎద్దేవా చేశారు. గూగుల్ విషయంలోనూ ఇదే జరిగిందని, మాటలు కోటలు దాటుతున్నా చేతల్లో ఏమీ లేదని విమర్శించారు. రాబోయే రోజుల్లో పార్టీని సరికొత్తగా తీర్చిదిద్దుతామని, 'జగన్ 2.0'లో కార్యకర్తలకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇచ్చారు. నేతలెవరూ చంద్రబాబును చూసి భయపడాల్సిన అవసరం లేదని, ఆ రోజులు పోయాయని ధైర్యం చెప్పారు.

నియోజకవర్గాల పునర్విభజన జరగబోతుండటం పార్టీకి మంచి పరిణామమని జగన్ అభిప్రాయపడ్డారు. దీనివల్ల మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని, గతంలో తాము పదవులు, కాంట్రాక్టుల్లో మహిళలకు ప్రాధాన్యత ఇచ్చామని, ఇప్పుడు చట్టసభల్లో కూడా మన మహిళలకు మరిన్ని అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు.


## పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులు త్వరగా పూర్తిచేయాలి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 25)

పునరుత్పాదక విద్యుత్ రంగంలో పెట్టుబడులు పెట్టే సంస్థలు ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. ప్రాజెక్టుల పురోగతిపై బ్రూక్‌ఫీల్డ్-యాక్సిస్ ప్రతినిధులు, నెడ్‌క్యాప్ ఉన్నతాధికారులతో సచివాలయంలో మంత్రి సమీక్షించారు. 'ప్రాజెక్టులు సాధ్యమైనంత త్వరగా ఉత్పత్తిలోకి తేవాలి. ఇబ్బందులు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలి. రాయలసీమలో ▶మిగతా 2లో

## ఆ 450 కిలోల యురేనియం ఇచ్చేయాలి ఇరాన్‌కు ట్రంప్ 15 కండీషన్స్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,మార్చి 25)

పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించేందుకు ఇరాన్‌తో అమెరికా ముమ్మరంగా చర్చలు జరుపుతోంది. ఇందులోభాగంగానే కాల్పుల విరమణ కోసం 15 పాయింట్లతో కూడిన ప్రణాళికను అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు పంపినట్లు తెలుస్తోంది. అదే సమయంలో పశ్చిమాసియాకు అదనపు బలగాలను పంపించేందుకు అమెరికా సిద్ధమవుతుండటం గమనార్హం.ఈ శాంతి ప్రణాళికను పాకిస్థాన్ ప్రతినిధుల ద్వారా అమెరికా ఇరాన్‌కు పంపించినట్లు సమాచారం. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ న్యూయార్క్ టైమ్స్ కథనం రాసింది. ఈ సీజ్ ఫైర్ ప్లాన్ గురించి ఇజ్రాయెల్‌కు అగ్రరాజ్యం ▶మిగతా 2లో

## ఐదేళ్లు పోలవరాన్ని నీరుగార్చిన వైకాపా ప్రభుత్వం



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,మార్చి 25)

వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం, అనుచిత నిర్ణయాలతో ఐదేళ్లపాటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను నీరుగార్చిందని తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు ఆరోపించారు. ఆయన మంగళవారం లోక్‌సభలో ఫైనాన్స్ బిల్లుపై జరిగిన చర్చలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 2019-23 మధ్య పోలవరం అమలులోని లోపాలను కాగ్ పేర్కొందని, ఆ అంశాలు పార్లమెంటు రికార్డుల్లోకి వెళ్లాలనే తాను దీనిగురించి మాట్లాడుతున్నానని చెప్పారు. "పోలవరం ఆంధ్రప్రదేశ్ జీవనరేఖ. ▶మిగతా 2లో

## 'వందేమాతరం' పాడటం తప్పనిసరి కాదు: సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 25)

ప్రభుత్వ, అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గేయం 'వందేమాతరం' పాడాలంటూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఆ సర్క్యులర్ కేవలం సలహా పూర్వకమైనదే తప్ప, తప్పనిసరి కాదని స్పష్టం చేసింది. అందులో ఎలాంటి శిక్షార్హమైన చర్యలు పేర్కొననందున, ఈ పిటిషన్‌పై విచారణ తొందరపాటు అవుతుందని అభిప్రాయపడింది.

భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం. పంచోలిలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈ ఏడాది జనవరి 28న కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్ కేవలం సలహా మాత్రమేనని, దాన్ని పాటించకపోతే శిక్షలు ఉంటాయని ఎక్కడా చెప్పలేదని ధర్మాసనం పేర్కొంది. "ఒకవేళ శిక్షార్హమైన చర్యలు తీసుకుంటే లేదా దీన్ని తప్పనిసరి చేస్తే అప్పుడు విచారిస్తాం. ప్రస్తుతానికి ఇందులో అలాంటివేమీ లేవు" అని కోర్టు వ్యాఖ్యానించింది. పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే, సర్క్యులర్‌లో శిక్షలు లేకపోయినా ఇది పరోక్ష ఒత్తిడికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వందేమాతరం పాడటానికి లేదా గౌరవ సూచకంగా నిలబడటానికి నిరాకరించే వారు సామాజిక వివక్షను ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆయన వాదించారు. "దేశభక్తిని బలవంతంగా రుద్దలేరు. వ్యక్తిగత అంతరాత్మను కాపాడాల్సిన బాధ్యత రాజ్యాంగంపై ఉంది" అని ఆయన నివేదించారు.అయితే, ▶మిగతా 2లో

## ప్రతి పనినీ నిర్దేశిత సమయంలో చేయాలి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 25)



సాగునీటి ప్రాజెక్టుల పనుల్ని నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని.. లేదంటే అమరావతికి వచ్చి సమాధానం చెప్పాల్సి ఉంటుందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టీకరించారు. వెలిగొండ ప్రాజెక్టు సొరంగాల లైనింగ్ పనుల్లో జాప్యంపై ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. త్వరగా పూర్తిచేయాలని పదేపదే చెబుతున్నా ఎందుకిలా అవుతోందని ప్రశ్నించారు. వెలిగొండ ప్రాజెక్టు, పోలవరం ఎడమ కాలువ పనులపై.. విజయవాడలోని క్యాంపు కార్యాలయం నుంచి జలవనరుల శాఖ అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'వెలిగొండ ప్రాజెక్టు టన్నెళ్ల లైనింగ్ పనుల్ని ఎప్పటికప్పుడు మెరుగు పరచుకుంటాం అని ▶మిగతా 2లో

## ఎల్పీజీ నుంచి పీఎన్‌జీ వైపు మళ్లిస్తాం: మంత్రి నాదెండ్ల



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 25)

ఏపీలో ఎక్కడా గ్యాస్ కొరత లేదని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులతో కొందరు ముందు జాగ్రత్తగా బుకింగ్‌లు చేస్తున్నారని చెప్పారు. పైప్డ్ గ్యాస్‌పై కొత్త పాలసీ తీసుకువచ్చేలా ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుంటుందన్నారు. "వాణిజ్య అవసరాలకు ఇచ్చే గ్యాస్ సరఫరాను కేంద్రం పెంచింది. రెస్టరంట్లు, విద్యాసంస్థలకు సరఫరా పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం. పట్టణాల్లో ప్రజలు పైప్డ్ గ్యాస్ కోసం నమోదు చేసుకోవచ్చు. సోలార్, ఇండక్షన్ కుకింగ్ స్టవ్‌లను వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నాం. సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌లో అమ్మకుండా ప్రత్యేక తనిఖీలు చేస్తున్నాం. అక్రమాలపై 800 కేసులు నమోదు చేసి 3,540 సిలిండర్లు సీజ్ చేశాం. బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. కచ్చితంగా వన్ టైమ్ పాస్‌వర్డ్ ద్వారానే గ్యాస్ సరఫరా జరపాలని ఆదేశాలిచ్చాం. అర్హత లేని వారి చేతుల్లోకి సిలిండర్లు వెళ్లకుండా చూసుకునే బాధ్యత మాపై ఉంది. పట్టణాల్లోని ప్రజలు పైప్డ్ గ్యాస్ కోసం నమోదు చేసుకోవచ్చు. పట్టణాల్లోని వినియోగదారులను ఎల్పీజీ నుంచి పీఎన్‌జీ వైపు మళ్లిస్తాం. రాష్ట్రంలో ఎక్కడా పెట్రోల్, డీజిల్ కొరత లేదు" అని తెలిపారు.

## మొదటి పేజీ తరువాయి

### విశాఖ స్టీల్ ప్లాంట్‌పై ఎందుకీ నిర్లక్ష్యం?

త్యాగం చేస్తే ఏర్పడిన విశాఖ ఉక్కుపై ప్రభుత్వాలకు ఎందుకీ నిర్లక్ష్యం? ఇప్పటికీ డిమాండ్లు నెరవేరలేదు. ప్రైవేటీకరణ కత్తి వేలాడుతూనే ఉంది. ప్రైవేటీకరణ ఉండదని ఏ ఒక్కరూ హామీ ఇవ్వడంలేదు. కేంద్రంలో భాజపా వచ్చాకే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు బీజం పడింది. సెయిల్‌లో విలీనం చేస్తే కర్మాగారం కష్టాలు తొలగుతాయని చెప్పినా పెడచెవిన పెట్టారు. క్యాప్టివ్ మైన్స్ ఇవ్వాలని అడిగినా పట్టించుకోలేదు. విశాఖ ప్లాంట్‌కు ఐరన్ ఓర్‌ను సరఫరా చేసే బైలదిల్లా నుంచే మిత్తల్ కర్మాగారానికి ఇవ్వబోతున్నారు. విశాఖ ఉక్కు ఉత్పత్తికి అవసరమైన ముడిసరకును తగ్గించాలని చూస్తున్నారా?' అని షర్మిల మండిపడ్డారు. 'ఉగాది పండుగకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జాబ్ క్యాలెండర్ జోక్ క్యాలెండర్. 1.80 లక్షల పోస్టులు ఖాళీగా ఉంటే 10 వేల పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తే ఎలా న్యాయం జరుగుతుంది? గ్రూపు పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల వయో పరిమితి 47 ఏళ్లకు పెంచాలి' అని డిమాండ్ చేశారు.

### ఇది తెదేపా 3.0 వెర్షన్

సంబంధం లేకుండా నేరుగా గుర్తించే లక్ష్యంతో పనిచేస్తున్నామని వెల్లడించారు. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు చుట్టూ కోటరీ లేదని, అన్ని విషయాలనూ ఆయన నేరుగా తెలుసుకుంటున్నారని చెప్పారు. ఈ నెల 29న నిర్వహించే పార్టీ ఆవిర్భావ వేడుకల్లో వేదికపై పార్టీ జాతీయ అధ్యక్షుడితో పాటు 'మై టీడీపీ' యాప్, క్లస్టర్, మండల పార్టీ అధ్యక్షులు, అనుబంధ విభాగాల నుంచి రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచిన 19 మంది కార్యకర్తలను గుర్తించి వేదికపై కూర్చొనే అవకాశం కల్పిస్తామని లోకేశ్ ప్రకటించారు.క్లస్టర్ ఇన్‌చార్జి, గ్రామపార్టీ అధ్యక్షులు పార్టీ పొలిట్‌బ్యూరోలో కూర్చునే స్థాయికి ఎదగాలని లోకేశ్ ఆకాంక్షించారు.

### పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులు త్వరగా పూర్తిచేయాలి

ఏర్పాటు చేసే పీఎస్‌పీ, సౌర, పవన ప్రాజెక్టులు పూర్తయితే పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిలో రాష్ట్రం అగ్రస్థానానికి చేరుకునే అవకాశం ఉంది. బ్యాటరీ స్టోరేజ్ ప్రాజెక్టుల కేంద్రంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలన్నది సీఎం ఆలోచన. ఇకపై ప్రతి 15 రోజులకోసారి ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షిస్తాం' అని మంత్రి పేర్కొన్నారు.

### ఆ 450 కిలోల యురేనియం ఇచ్చేయాలి: ఇరాన్‌కు ట్రంప్ 15 కండీషన్స్

ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదని తెలుస్తోంది. అయితే, ఈ కథనాలపై వైట్‌హౌస్ నుంచి స్పందన రాలేదు. యుద్ధం ముగింపు కోసం ఈ ప్రణాళికలో టెహ్రాన్‌కు కొన్ని షరతులు విధించింది. అవేంటంటే..ఇరాన్ తనకున్న అణుసామర్థ్యాలను తప్పనిసరిగా నిర్వీర్యం చేయాలి. నతాంజ్, ఇస్ఫహాన్, ఫోర్డో అణు కేంద్రాలను ధ్వంసం చేయాలి. అణ్వాయుధాలు ఎప్పటికీ సమకూర్చుకోబోమని ఇరాన్ హామీ ఇవ్వాలి. ఇరాన్ భూభాగంపై అణుశుద్ధి జరగకూడదు ఇరాన్ తన వద్ద నిల్వ ఉంచుకున్న 450 కిలోల యురేనియంను ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీకి అప్పగించాలి. హర్మూజ్ జలసంధిని తెరవాలి. దాన్ని ఫ్రీ మారిటైమ్ కారిడార్‌గా నిర్వహించాలి.

ఇరాన్ క్షిపణి కార్యక్రమాలను పరిమితంగా చేపట్టాలి. వాటి రేంజ్, సంఖ్యను తగ్గించుకోవాలి. ఆత్మరక్షణ కోసం క్షిపణులను ఉపయోగించుకోవాలి.మరో 1000 మంది బలగాలు..ఈ షరతులకు అంగీకరిస్తే.. ఇరాన్‌పై అంతర్జాతీయ సమాజం విధించిన ఆంక్షల్ని పూర్తిగా ఎత్తేస్తామని అమెరికా ఈ ప్రణాళికలో హామీ ఇచ్చింది. అంతేగాక.. పౌర అణు ఇంధనశక్తిని పెంపొందించుకొనే కార్యక్రమాలకు సాయం అందిస్తామని తెలిపింది. అయితే, ఓవైపు శాంతి ప్రణాళికను ఆఫర్ చేస్తూ పశ్చిమాసియాకు అగ్రరాజ్యం బలగాలను పంపించేందుకు సిద్ధమైంది. మరో 1000 మంది సైన్యంతో పాటు రెండు మెరైన్ యూనిట్లను ఈ ప్రాంతంలో మోహరించేందుకు పెంటగాన్ సన్నాహాలు చేస్తోంది.

**ఓటమిని ఒప్పందం అనొద్దు: ఇరాన్**

కాగా.. ఈ సీజ్‌ఫైర్ ప్లాన్‌పై ఐఆర్‌జీసీ అధికార ప్రతినిధి స్పందిస్తూ అమెరికాపై విమర్శలు గుప్పించారు. "మీ ఓటమిని శాంతి ఒప్పందంగా పిలవొద్దు. ఈ ప్రాంతంలో మీ పెట్టుబడులను మేం అంగీకరించబోం" అని ఐఆర్‌జీసీ అధికార ప్రతినిధి స్పష్టంచేశారు. యుద్ధం ముగింపుపై అమెరికాతో చర్చల వార్తలను కూడా ఖండించారు.

### ఐదేళ్లు పోలవరాన్ని నీరుగార్చిన వైకాపా ప్రభుత్వం

లక్షల ఎకరాలకు సాగునీరు, లక్షల కుటుంబాలకు తాగునీరు అందిస్తుంది. ప్రజలు కోరుకుంటున్న ఆ ప్రాజెక్టుకు కేంద్రం ఆర్థికంగా మద్దతిస్తున్నా 2019–24 మధ్యకాలంలో దాని పరిస్థితి ఎలా ఉందన్నది కాగ్ తన నివేదికలోని 11వ పేజీలో స్పష్టంగా చెప్పింది. 2019–23 మధ్య ఆ ప్రాజెక్టు నిధుల కేటాయింపులకు అప్పటి ప్రభుత్వం దాదాపు 50% కోతపెట్టినట్లు పేర్కొంది. భూసేకరణ, సహాయ, పునరావాస పనుల కోసం కేంద్రం రూ.2,097 కోట్లు కేటాయించినా గత ప్రభుత్వం నిర్వాసితులకు పైసా కూడా చెల్లించలేదు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ సూచనలను పెడచెవిన పెట్టి ప్రధాన డ్యాం ప్యాకేజీ పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌ను తొలగించినట్లు కాగ్ నివేదికలోని 38, 39 పేజీల్లో ఉంది. కాంట్రాక్ట్ సంస్థను మధ్యలో తొలగించడంతో వరదలకు డయాఫ్రం వాల్ దెబ్బతిన్నట్లు 33, 34 పేజీల్లో స్పష్టం చేసింది. రీటెండరింగ్ నిబంధనలను ఉల్లంఘించి, బిడ్డింగ్ ప్రక్రియ కాలపరిమితిని 16 రోజుల నుంచి 21 రోజులకు పెంచినట్లు 40వ పేజీలో పేర్కొంది. 2019–24 మధ్యకాలంలో ప్రాజెక్టు పూర్తికి అవసరమైన చర్యలు తీసుకోవడానికి బదులు ప్రతిదీ అందుకు విరుద్ధంగా చేసినట్లు కాగ్ కుండ బద్దలుకొట్టింది" అని లావు పేర్కొన్నారు. పన్ను వివాదాలు పెరిగిపోవడంపై ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. పన్ను వసూళ్ల సామర్థ్యాన్ని పెంచడానికి సంస్కరణలు తీసుకురావాలని కోరారు. ఏఐ, సెమీకండక్టర్, పరిశోధన, అభివృద్ధి రంగాలకు చేసిన కేటాయింపులు పూర్తిస్థాయిలో ఖర్చు చేయలేకపోవడం ఆందోళనకరమన్నారు.

### 'వందేమాతరం' పాడటం తప్పనిసరి కాదు: సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

పిటిషనర్ వ్యక్తం చేస్తున్న ఆందోళనలు ప్రస్తుతానికి ఊహాజనితమేనని ధర్మాసనం అభిప్రాయపడింది. ఒకవేళ ఎవరిపైనైనా శిక్షార్హమైన చర్యలు తీసుకున్నా లేదా వివక్ష చూపినా, అప్పుడు మళ్లీ కోర్టును ఆశ్రయించవచ్చని సూచిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. విద్యాసంస్థలు, బహిరంగ సభల్లో వందేమాతరం పాడాలని కేంద్రం సర్క్యులర్‌లో సూచించింది. ఇది కేవలం జాతీయ గేయంపై గౌరవాన్ని పెంపొందించడానికేనని, చట్టబద్ధంగా అమలు చేయాలనే ఉద్దేశం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

వందేమాతరం స్ఫూర్తి గురించి ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభలో ప్రస్తావించడం గమనార్హం. బంకించంద్ర చటోపాధ్యాయ 1875లో రచించిన ఈ గేయం, స్వాతంత్ర్య పోరాటంలో ప్రజలను ఏకతాటిపై నడిపించిందని కొనియాడారు. రవీంద్రనాథ్ ఠాగూర్ స్వరపరిచిన ఈ గీతాన్ని 1896లో కాంగ్రెస్ సమావేశంలో తొలిసారి ఆలపించారు. 1950లో అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ దీనికి జాతీయ గేయం హోదా కల్పించారు.

### ప్రతి పనినీ నిర్దేశిత సమయంలో చేయాలి

చెబుతున్నా పురోగతి కనిపించడం లేదు. పనులను చురుగ్గా చేయించాలి. అప్పుడే ప్రజలకు ఇచ్చిన హామీ నెరవేర్చగలుగుతాం. సీజన్ మొదలయ్యేలోగా గోదావరి జలాల్ని అనకాపల్లి వరకు తీసుకెళ్లేలా పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు పూర్తిచేయాలి' అని ఆదేశించారు.

## మండలంలో రైతన్న మీకోసం కార్యక్రమం






(షణ్ముఖ వెలుగు, పొదిలి, మార్చి 25)

మండలంలో అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతన్న మీకోసం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు సలకనూతల, మూగ చింతల రైతు సేవ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాంకేతికను ఉపయోగించుకొని ఖర్చు తగ్గించి దిగుబడి పెంచాలని, వ్యవసాయంలో డ్రిప్ టెక్నాలజీ, డ్రోన్లు వినియోగంలో ఉన్నాయని వాటి వినియోగించాలని ఆయన రైతులను కోరారు. రైతులకు రైతు ఐడి ఇవ్వడం ద్వారా ప్రతి రైతు వివరాలను ఒక సమగ్ర డిజిటల్ వ్యవస్థలోకి తీసుకుని రైతు పంట సేవలు అన్ని ఒకే వేదికపై అందుబాటులోకి వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. దీనివల్ల రైతుకు అన్ని సేవలు వేగంగా అందడమే కాకుండా పథకాలు అమలు సులువు అవుతుందని, ఈ పంట ద్వారా సాగు విస్తీర్ణాన్ని డిజిటల్ గా నమోదు చేస్తూ పారదర్శకత, రైతులు స్వయంగా ఈ పంట బుకింగ్ చేసుకునే సదుపాయం కూడా ఫార్మర్ యాప్ 2.0లో అందుబాటులో ఉందన్నారు. అంతే కాకుండా పంటల్లో వచ్చే చీడ పీడలను గుర్తించటానికి ఏఐ ఆధ్వర్యంలో పెస్ట్ సర్వేలెన్సు వ్యవస్థలను కూడా అందుబాట్లో ఉన్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా అన్ని రైతు సేవ కేంద్రాల వ్యవసాయ సహాయకులు, ఉద్యానవన సహాయకులు, రైతులు పాల్గొన్నారు

## గ్యాస్ ఏజెన్సని తనిఖీ చేసిన తహశీల్దార్ బ్లాక్‌లో గ్యాస్ అమ్మితే కఠిన చర్యలు



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, మార్చి 25)

గ్యాస్ ఏజెన్సీలు ప్రభుత్వ నియమాలను కచ్చితంగా పాటిస్తూ సక్రమంగా గ్యాస్ సిలిండర్లు సరఫరా చెయ్యాలని మండల



తహశీల్దార్ జె ప్రభాకరరావు అన్నారు. బుధవారం మండలంలోని శేషాద్రి ఇండియన్ గ్యాస్ ఏజెన్సీను అకస్మాకంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్యాస్ ఏజెన్సీ వారి తీసుకుంటున్న చర్యలు, భద్రతా ప్రమాణాలు, రికార్డులను పరిశీలించారు.ఇ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ నిబంధనలు పాటించాలని గ్యాస్ బ్లాక్‌లో అమ్మిన, అక్రమంగా నిల్వ వుంచిన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలో గ్యాస్ నిల్వలు అందుబాటులో వున్నాయని మార్చి17 వరకు గ్యాస్ బుకింగ్ చేసుకున్న వారికి ఈ రోజు గ్యాస్ డెలివరీ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జె ప్రభాకరరావు, ఫుడ్ ఇన్స్పెక్టర్ సురేష్ బాబు పాల్గొన్నారు.

## దశలవారీగా అన్ని బస్టాండ్లలో మంచినీటి వసతి కల్పిస్తాం

### రీజనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు, పొదిలి, మార్చి 25)

దశలవారీగా అన్ని ఆర్టీసీ బస్ స్టేషన్లలో ప్రయాణికుల సౌకర్యార్థం ఉచిత మంచినీటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు రీజనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆర్టీసీ డ్రైవర్ కొత్త విజయభాస్కర్‌రెడ్డి, వారి మిత్రుడు వెన్నపూస ఇంద్రసేనారెడ్డిల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన మంచినీటి ఆర్వో ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ నాటికి దాతల సహకారంతో మరో ఆరో ప్లాంట్ నిర్మాణం చేసి ప్రయాణికులకు మంచినీటి సమస్య తీరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దాతలు కొత్త విజయభాస్కర్‌రెడ్డి, వెన్నపూస ఇంద్రసేనారెడ్డి, ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సత్యనారాయణ, పొదిలి డిపో మేనేజర్ శంకరరావు, జిల్లాలోని వివిధ డిపోల మేనేజర్లు సిబ్బంది, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శీనునాయక్‌కు కుక్కమూడి ప్రసాద్



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, మార్చి 25)

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పల్నాడు జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్, దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుక్కమూడి ప్రసాద్ కోరారు. తొలుత మాచర్ల కార్మిక శాఖ కార్యాలయ పరిధిలోని భవన నిర్మాణ, ఇతర నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బుధవారం మాచర్ల పట్టణంలోని సహాయ కార్మిక శాఖ అధికారి వారి కార్యాలయం నందు సహాయ కార్మిక అధికారి ( అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్) అయిన ఆర్ శీను నాయక్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యల గురించి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లగా వారు సమస్యల పై సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. అనంతరం ఇటీవల 2026 మార్చి 8న మాచర్ల కార్మిక శాఖ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆర్ శ్రీను నాయక్‌ను ప్రజా సంఘాల నాయకులు శాలవాలతో ఘనంగా సత్కరించి అభినందనలు శుభాకాంక్షలు తెలియజేశారు. తనను సన్మానించిన ప్రజా సంఘాల నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌ను సన్మానించిన వారిలో దళిత బహుజన భీమ్సేన రాష్ట్ర అధ్యక్షులు దళిత నాయకుడు అల్లి అచ్చయ్య, తదితరులు ఉన్నారు.

## పేకాట రాయుళ్ల అరెస్ట్



(షణ్ముఖ వెలుగు, పామూరు, మార్చి 25)

మండలంలోని అనుమలకొండ గ్రామ శివార్లలో పేకాట ఆడు తున్న సమాచారం అందుకున్న ఎస్ఐ అనోక్ తన పోలీసు సిబ్బందితో పేకాట శిబిరం పై దాడి చేశారు. ఈ దాడిలో 8 మంది పేకాట రాయుళ్ళను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వారి పై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై అనోక్ తెలిపారు.

## వైభవంగా శ్రీ సీతాలక్ష్మణ హనుమత్సమేత

### కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం స్వామివారి పంచలోహ విగ్రహాలు వితరణ చేసిన సుబ్బరాజు కుటుంబ సభ్యులు



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, మార్చి 25)

బద్వేలు పట్టణ పరిధిలో మార్తోమానగర్, ఆంజనేయనగర్ నందు నూతనంగా నిర్మించిన శ్రీ కోదండరామస్వామి దేవాలయం 27వ తేది శుక్రవారం వరకు శ్రీ సీతాలక్ష్మణ హనుమత్సమేత కోదండ రామస్వామి శిఖర, కలశ, ద్వజ, కుంబాభాషేక మహోత్సవ కార్యక్రమాన్ని బుదవారం నుంచి శుక్రవారం 3 రోజుల పాటు దేవస్థాన కమిటి సభ్యులు, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం వేదపండితులు బ్రహ్మశ్రీ గానుగపాటి రాజశేఖర్ శర్మ ఆధ్వర్యంలో గణపతి ప్రార్థన, గంగా నయనం, అఖండ దీపారాధన, పంచగవ్య ప్రాసనం మాతృకా పూజ, రక్షా బంధనం, రుత్విగ్వరణం, యాగశాల ప్రవేశం, కలశ స్థాపన, శోడష మండపపూజ, వాస్తు సర్వతో భద్ర నవగ్రహ, సుదర్శన ఆరాధనతో పాటు పాటు పలురకాల పూజలు నిర్వహించారని ఆలయ కమిటి సభ్యులు ఎస్ వెంకటసుబ్బయ్య, శీలి రమణయ్య, గిద్దలూరు తిరుపాలయ్య, మెడిమిశివయ్య, శీలి నరసింహులు, చార్ల నరసింహులు, కోరపల్లి చిన్నయ్య, ఉర్లకొండయ్యలు తెలిపారు. అలాగే సాయంత్రం మృత్యుంగ్రహణం, అంకురారోపణం. అగ్ని ప్రతిష్ట గణపతి హోమం, దీక్షాహ జలాధివాసం, నివేదన మంగళహారం మంత్రపుష్పం, రాత్రి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక భజన కార్యక్రమం నిర్వహించి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న వారికి అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు.

**స్వామివారి పంచలోహ ఉత్సవ విగ్రహాలు వితరణ:**

శ్రీ సీతాలక్ష్మణ హనుమత్సమేత కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవానికి సుమారు రూ.1,50,00వేలు విలువ చేసే పంచలోహ విగ్రహాలను 11వ వార్డుకు చెందిన కీ.శే వేముల వెంకటసుబ్బయ్య, సతీమణి వెంకటలక్షుమ్మ కుమారుడు వేముల సుబ్బరాజ సతీమణి వెంకట సుధ, సౌమ్యశృతి, అక్షరకుటంబ సభ్యుల సహకారంతో ప్రత్యేక బ్యాండు మేళతాల మధ్య కమిటి సభ్యులకు అందించారు. సుబ్బరాజ కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ సభ్యులు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుబ్బరాజా మాట్లాడుతూ మార్తోమానగర్ లో ఎంతో వైభవంగా నిర్మాణం చేపట్టిన స్వామి వారి ఆలయ నిర్మాణానికి పంచలోహ విగ్రహలు తమ కుటుంబం తరపున ఇవ్వడం తమకెంతో సంతోషకరమన్నారు. ఈ ప్రాంతంలోని భూదులు స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.

## మణికేశ్వరం నిర్వాసితుల భూ సమీకరణ పై అధికారుల కసరత్తు



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, మార్చి 25)

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో కందుల ఓబుల్‌రెడ్డి గుండ్లకమ్మ ప్రాజెక్టు ముంపు గ్రామమైన మణికేశ్వరం నిర్వాసితులకు నివేశ స్థలాల కేటాయింపు కోసం బుధవారం అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా కొంగపాడు గ్రామ రైతులతో ప్రాజెక్టు అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న భూ సమీకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు పలువురు రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. అర్హులైన నిర్వాసితులకు త్వరగా ఇళ్ల స్థలాలు అందించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షులు షేక్ కరిముల్లా, ప్రాజెక్టు సర్వేయర్, రెవెన్యూ అధికారులు, స్థానిక రైతులు గుడిపాటి శ్రీనివాసరావు, హనుమంతరావు, కర్రి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు | తెలుగు దినపత్రిక

26.03.26 గురువారం


## నగర ముఖచిత్రాన్ని మార్చేలా ప్రణాళికలు రూపొందించాలి

జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మార్చి 25)

ఒంగోలు నగర ముఖ చిత్రాన్ని మార్చేలా అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు చెప్పారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఈ దిశగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు, ఆంధ్ర ప్రదేశ్ అర్బన్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ అసెట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ ప్రతినిధులకు దిశా నిర్దేశం చేశారు. రామాయపట్నం పోర్టు, బీపీసీఎల్, ఇండో సోల్, జిందాల్ కంపెనీల పెట్టుబడులు, మైనింగ్ కార్యకలాపాలు, పర్యాటక అభివృద్ధి ఊపొందుకుంటున్న నేపథ్యంలో జిల్లా కేంద్రమైన ఒంగోలును ఆతిథ్య పరంగా, ఆహ్లాదకరంగా భవిష్యత్తు అవసరాలకు తగినట్లుగా అభివృద్ధి చేయబోతున్నట్లు కలెక్టర్ ఈ సందర్భంగా చెప్పారు. రిక్రియేషన్ సెంటర్, సెంట్రల్ పార్కు ఏర్పాటు చేయడంతో పాటు ఇప్పటికే ఉన్న ట్రంకు రోడ్డును విస్తరించి, పార్కింగ్ సదుపాయాలను విస్తృతం చేసి, రద్దీ ప్రాంతాలలో అధునాతన టాయిలెట్లు నిర్మించి, డిజిటల్ డిస్ప్లే లతో నగరానికి మరింత శోభ తీసుకురావడంపై దృష్టి పెట్టామన్నారు. నగరంలోనికి ప్రవేశ, వీడ్కోలు జంక్షన్లు మరింత ప్రత్యేకతతో కూడినవిగా తీర్చిదిద్దబోతున్నామన్నారు. నగరానికి వెలుపల శాటిలైట్ టౌన్ షిప్ కూడా ఏర్పాటు (తరువాయి 4లో...)

# పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి

ప్రకాశం, మార్కాపురం జిల్లాల పోలీసు అధికారులతో సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు
విచారణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలి
మహిళల భద్రతకు ప్రాధాన్యతిచ్చి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించండి
రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు మరింత ప్రత్యేక చర్యలు అమలు చేయాలి
డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలిలి
ఎన్ఫోర్స్మెంట్‌ను పెంచి చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయాలి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మార్చి 25)

బాధితులకు వేగవంతంగా, పూర్తిస్థాయిలో న్యాయం అందించినప్పుడే పోలీస్ శాఖపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని, ఆ స్థాయిగా సిబ్బంది మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు అన్నారు. ప్రకాశం, మార్కాపురం జిల్లాల డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ ముఖ్యంగా గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, హత్య కేసులు, క్రైమ్ ఎగైనెస్ట్ వుమన్, ప్రాపర్టీ కేసులు, పెండింగ్‌లో ఉన్న నాన్‌బెయిలబుల్ వారెంట్లు, రోడ్డు ప్రమాదాలు, ఆయా సబ్‌డివిజన్‌లలోని సీసీ కెమెరాల పనితీరు, ఎన్ఫోర్స్మెంట్ , ఇతర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సమావేశంలో పెండింగులో ఉన్న కేసుల దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేసి కోర్టులో సాక్ష్యాలతో నేర నిరూపణ చేసి శిక్షలు పడే విధంగా చూడాలని ఆదేశించారు. మహిళలు, పిల్లలకు సంబంధించిన కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి, నిర్ణిత గడువులో చార్జ్‌షీట్ దాఖలు చేయాలని, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్త చట్టాలకు సంబంధించిన అప్లికేషన్స్ ఎప్పటికప్పుడు అప్డేట్ ఉంచుకోవాలని సూచించారు. నాన్‌బెయిలబుల్ వారెంట్లు ఉన్న వ్యక్తులను తక్షణమే అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచాలని సూచించారు. ప్రాపర్టీ నేరాల్లో నిందితులను త్వరగా పట్టుకుని ప్రాపర్టీ రికవరీ శాతాన్ని పెంచాలని, దొంగతనాలు, దోపిడీల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్, నైట్ బీట్స్ బలోపేతం చేసి క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో చెడునడతగల వ్యక్తులు, పాతముద్దాయిల పై నిఘా పెట్టాలని, ప్రతి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎన్ఫోర్స్మెంట్ పెంచాలని, పేకాట ,మట్కా గంజాయి, కోడి పందాలు, బెట్టింగ్ పూర్తిగా అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని, అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. గ్రామ సందర్శనలు చేసి ఎక్కడైనా గ్రామాలలో గొడవలు సృష్టించే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడం ప్రధాన లక్ష్యంగా సంబంధిత శాఖలను సమన్వయం చేసుకుని తగు చర్యలు తీసుకోవాలని, ముఖ్య ప్రాంతాలలో పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్ ద్వారా వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలపై ఇంకా విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సైబర్ నేరాలు, గంజాయి వంటి మాదక ద్రవ్యాల అనర్థాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, కొత్త చట్టాలు, శిక్షలు, బాల్య వివాహాలు, గుడ్ టచ్-బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. కెమెరాల యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు తెలియచేసి ఏర్పాటు చేసే విధంగా చూడాలని, పబ్లిక్ గ్రీవెన్స్‌లో స్వీకరించిన ప్రజా ఫిర్యాదులపై త్వరితగతిన చర్యలు చేపట్టి, ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో విచారణ జరిపి పరిష్కారం చూపాలని తెలిపారు. (తరువాయి 4లో...)

# నిరాశల మధ్య ప్రారంభమైన పొగాకు వేలం



తొలి రోజు కిలో రూ.250 పలికిన ధర
నాణ్యమైన పొగాకుకు గిట్టుబాటు ధర లభిస్తుంది
వేలం ప్రారంభం అనంతరం మీడియాతో
గుంటూరు టుబాకో బోర్డు ఈడి విశ్వశ్రీ

(షణ్ముఖ వెలుగు, పొదిలి, మార్చి 25)

నిరాశల మధ్య పొదిలి పొగాకు వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్ళు ప్రారంభమయ్యాయి. గత ఏడాది నష్టాల మూటగట్టుకున్న పొగాకు రైతులు ఈ ఏడాది ఆశ నిరాశల మరోసారి పొగాకు అమ్మకాలకు సిద్ధపడుతున్నారు. బుధవారం నుంచి ఆంధ్రాలో పొగాకు కొనుగోళ్ళు ప్రారంభమైన నేపథ్యంలో రైతులు ఈ ఏడదైనా తమకు గిట్టుబాటు ధర లభిస్తుందా అనే అనుమానంతో అమ్మకానికి సిద్ధమవుతున్నారు. ఈ సంవత్సరం పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రంలో పొగాకు అమ్మకాలు అనుకున్న స్థాయిలో రైతులకు దోహదపడలేదు. గత ఏడాది అధిక దిగుబడితో పాటు నాణ్యతలేని లో గ్రేడ్ పొగాకుతో రైతులు అవస్థలు పడి అప్పుల్లో కూరుకు పోయారు. ఈ ఏడాది కూడా ఆశించిన స్థాయిలో వాతావరణ పరిస్థితులు లేకపోవడంతో పొగాకు సాగుకు పెట్టుబడి అధికమైంది. రైతులు రెండు మూడు దఫాలుగా నాట్లు వేయాల్సిన పరిస్థితుల్లో నాణ్యత బాగున్నా గిట్టుబాటు ధరపైనే వారు ఆశలు పెట్టుకున్నారు. కొనుగోళ్లలో కూడా ఎక్కువ కంపెనీలు పాల్గొనడం లేదని కేవలం ఐటిసి, జిపిఐ, పోలిశెట్టి మాత్రమే కొనుగోలు చేస్తున్నారని తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో ఆంధ్ర పొగాకు ఎంత మాత్రం అమ్మకం అవుతుందో అన్నదాతలకు పరీక్ష కానుంది. విశ్వసనీయ సమాచారం మేరకు మొత్తంగా పొగాకు కొనుగోళ్లలో అటు కర్ణాటక ఇటు (తరువాయి 4లో...)

# రూ.4 వేల కోట్లతో పండ్ల తోటల పెంపకం

మంత్రి జనార్ధన్‌రెడ్డి

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మార్చి 25)

రాయలసీమతో పాటు మార్కాపురం జిల్లాలో రూ.4 వేల కోట్లతో పండ్ల తోటల పెంపకం చేపట్టి ఈ ప్రాంతాన్ని ఉద్యానవన హబ్‌గా మార్చనున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం వెలిగండ్ల మండలం గన్నవరంలో రైతన్న - మీ కోసం ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పండ్ల తోటలకు 100 శాతం సబ్సీడితో రాయితీలు కల్పించడం జరుగుతుందన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ డిమాండ్ ఆధారిత పంటలను రైతులు సాగు చేయాలన్నారు. రైతులకు అన్ని రకాల ప్రోత్సాహకాలు కల్పిస్తున్న కూటమి ప్రభుత్వం మరిన్ని రాయతీలు కల్పిస్తుందన్నారు. 12 ఏళ్ళుగా గన్నవరం బ్రిడ్జి పూర్తి కాకపోవడం శోచనీయమన్నారు. ఎమ్మెల్యే ఉగ్ర పట్టువదలని విక్రమార్కుడిలా గన్నవరం బ్రిడ్జికి నిధులు తెచ్చి పూర్తి చేయించడం అభినందనీయమన్నారు. గన్నవరం - గండ్లోపల్లి రోడ్డును తారు రోడ్డుగా మారుస్తామన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అభివృద్ధిని విస్మరించి కక్ష సాధింపులకు పాల్పడ్డారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతుందన్నారు. ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ కనిగిరి ప్రాంతంలో రోడ్లు అభివృద్ధికి మంత్రి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. పదేళ్ళుగా (తరువాయి 4లో...)



# అద్దంకి నేతలతో మాజీ సీఎం జగన్ సమావేశం

టికెట్ పై స్పష్టత ఇవ్వని అధినేత



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, మార్చి 25)

తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర పార్టీ కార్యాలయం నందు బుధవారం నియోజకవర్గ వైయస్సార్ పార్టీ ముఖ్య నేతలు, ఆయా విభాగాల నాయకులు, కార్యకర్తలతో మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో జగన్ మాట్లాడుతూ ప్రతిసారి అద్దంకి ఓడిపోతూ వస్తున్నామని, ఈ సారి సమిష్టిగా కృషి చేసి గెలిపించుకోవాలన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ ముందుకు వచ్చాడని, అద్దంకిలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నాడని జగన్ కొనియాడారు. నియోజకవర్గంలోనే నూతన ఆసుపత్రి ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయాలనుకుంటున్నాడని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు అశోక్ బాబు సారథ్యం లో పనిచేయాలని జగన్ సూచించారు. వైసిపి అధికారంలోకి వచ్చాక గ్రామాలలో కార్యకర్తలు, నాయకులకు ప్రాధాన్యత ఉంటుందని సమావేశంలో జగన్ స్పష్టం చేశారు. ఈసారి జగన్ 2.0లో కార్యకర్తలు, నాయకులు చెప్పిందే జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని దానికి అనుగుణంగా వైసిపి పార్టీని మరింత బలపరుచుకోవాలని జగన్మోహన్‌రెడ్డి దిశా, నిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాలను జనంలోకి తీసుకువెళ్లాలని ఆయన సూచనలు చేశారు. 2027వ సంవత్సరంలో తన పాదయాత్ర ఉంటుందని ప్రతి ఒక్కరిని పేరు పెట్టి పిలిచేలా తన యాత్ర సాగుతుందని జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. అయితే అద్దంకి టికెట్ డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ కే అని జగన్మోహన్‌రెడ్డి స్పష్టత ఇవ్వకపోవడంతో కొంతమంది నాయకులు, కార్యకర్తలతో సందిగ్ధత ఏర్పడింది. అయితే నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో అద్దంకి నియోజకవర్గ రిజర్వేషన్ మారుతుందని అందుకే తమ అధినేత ఎటూ తేల్చలేదని కొంతమంది నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. (తరువాయి 4లో...)

## ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్ పరీక్షలో సత్తా చాటిన కనిగిరి ఆదర్శ పాఠశాల విద్యార్థులు

### అభినందించిన మండల విద్యాశాఖాధికారులు






(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, మార్చి 25)
కనిగిరి ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్ పరీక్షలో అత్యధికంగా పదకొండు స్థానాలు సాధించి కనిగిరి పట్టణ చరిత్రలో సరికొత్త రికార్డు నెలకొల్పి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. రోజు వారీ తరగతులతో పాటుగా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ, క్రమం తప్పకుండా ప్రతిరోజూ జరిగిన పాఠ్యాంశాల పై పరీక్షలు నిర్వహిస్తూ, విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తూ ఉపాధ్యాయులు పడిన శ్రమ ఈ విజయానికి కారణమయ్యాయన్నారు. ఈ ఫలితాల స్ఫూర్తితో వచ్చే విద్యా సంవత్సరం నుండి రెట్టింపు ఫలితాలను సాధిస్తామని ఈ సందర్భంగా నిర్వహించిన విజయోత్సవ సభలో ప్రధానోపాధ్యాయురాలు తులసి పద్మావతి తెలియజేశారు. విద్యార్థులను అభినందించిన మండల విద్యాశాఖ అధికారులు ఈ విజయోత్సవ సభలో పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారులు నారాయణరెడ్డి, రామిరెడ్డి కనిగిరి పట్టణ చరిత్రలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఆదర్శ పాఠశాల విద్యార్థులకు శుభాకాంక్షలు అందించారు. పిల్లల విజయాలకు కారణమైన ప్రధానోపాధ్యాయురాలు తులసి పద్మావతి, ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పందిటి మోహన్ అభినందనలు ఈ కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పందిటి మోహన్ పేద విద్యార్థుల అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించినందుకు తల్లిదండ్రుల కమిటీ తరపున ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులకు దుశ్శాలువాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేశారు.

## బస్సులో మరిచిపోయిన బంగారం నిజాయితీతో తిరిగి అందించిన బస్సు కండక్టర్



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మార్చి 25)
గుడ్లూరుకు చెందిన దేవరకొండ వెంకాయమ్మ బుధవారం తన బ్రాస్లెట్‌ను మాచవరం బ్యాంకులో తాకట్టు పెట్టి డబ్బులు తీసుకోవడానికి వెళ్లింది. అయితే బ్యాంకులో పని పూర్తికాకపోవడంతో తిరిగి గుడ్లూరుకు రావడానికి ఏపి 27 టిజెడ్ 0808 నంబర్ బస్సులో ఎక్కింది. ఆ సమయంలో తన గోల్డ్ బ్రాస్లెట్ (సుమారు 2 లక్షల గల)ను బస్సులో మర్చిపోయి గుడ్లూరులో దిగింది. ఈ విషయాన్ని గుడ్లూరు పోలీస్ స్టేషన్‌లో తెలియజేయగా, అక్కడ ఉన్న భౌజ ఉషారాణి,ాజ లక్ష్మణ స్వామి, డ్రైవర్ సురేంద్ర వెంటనే ఎస్ఐ వెంకట్రావుకి సమాచారం అందించారు. అనంతరం వారు బస్సు కండక్టర్‌ను సంప్రదించారు. ఈలోపు బస్సు కండక్టర్ తన సీటులో ఉన్న బ్రాస్లెట్‌ను గుర్తించి, దాన్ని భద్రంగా తన వద్ద ఉంచుకుని వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అనంతరం కండక్టర్ గారు నిజాయితీగా గోల్డ్‌ను గుడ్లూరు పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి, బాధితురాలు దేవరకొండ వెంకాయమ్మకు అప్పగించారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ, ఆమె కుటుంబ సభ్యులు బస్సు కండక్టర్ చంద్రమోహన్ రావుకి, డ్రైవర్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సంఘటనలో నిజాయితీగా వ్యవహరించిన బస్సు కండక్టర్ చంద్రమోహన్‌రావు, డ్రైవర్‌ను ఎస్ఐ సత్కరించారు.

## ఫోక్సో చట్టం పై విద్యార్థులకు అవగాహన



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మార్చి 25)
మైనర్లపై లైంగిక వేధింపుల కేసులు పెరిగిపోతున్న నేపథ్యంలో వారికి రక్షణ కల్పించడానికి ఫోక్సో చట్టం ఎంతో అవసరమై ఎస్సై పి సత్యనారాయణ తెలిపారు. మండలంలోని మాలెపాడు కస్తూరిబా గాంధీ పాఠశాలలో బుధవారం ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఎస్సై సత్యనారాయణ మాట్లాడుతూ ఫోక్సో చట్టం పిల్లల హక్కులను కాపాడుతుందని వారికి సురక్షితమైన వాతావరణాన్ని కల్పిస్తుందని అన్నారు. ఫోక్సో చట్టంతో పాటు సైబర్ నేరాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ కలిగే దుష్ఫలితాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు

# రూ.4 వేల కోట్లతో పండ్ల తోటల పెంపకం









కనిగిరి ప్రాంతంలో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దశాబ్దాలుగా ఆగిపోయిన పనులకు మోక్షం కలుగుతుందన్నారు. కనిగిరి అభివృద్ధే తన లక్ష్యమన్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలు మారినా గన్నవరం బ్రిడ్జిని పూర్తి చేయలేకపోయారన్నారు. డిగ్రీ కాలేజీ అదనపు గదులను ప్రారంభించడం, ఓవి రోడ్డు నిర్మాణానికి మంత్రి చేతుల మీదుగా భూమి పూజ చేయించడం ఆనందంగా ఉందన్నారు. డిసిఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి మాట్లాడుతూ రైతన్నలు ప్రభుత్వం అందించే ఆధునిక వ్యవసాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి జనార్ధన్‌రెడ్డి రైతు రథాన్ని నడిపి పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిలు మహాలక్ష్మమ్మ, డి ప్రకాశం, టిడిపి నాయకులు బోయళ్ళ నారాయణరెడ్డి, చెంచిరెడ్డి, పార్టీ అధ్యక్షులు ఇంద్ర భూపాల్‌రెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, ఫిరోజ్, దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, సురేష్‌రెడ్డి, రావి శ్రీనివాసులు, చిలకల వెంకటేశ్వరరెడ్డి, ఉండేల భాస్కర్‌రెడ్డి, ఉండేల పిచ్చిరెడ్డి, బుల్లా బాలబాబు, తదితరులు పాల్గొన్నారు.

## నిరాశల మధ్య ప్రారంభమైన పొగాకు వేలం

ఆంధ్రలో ఏడాది గడ్డ పరిస్థితులు ఉండవచ్చని అంచనా వేస్తున్న నేపథ్యంలో ఆంధ్రాలో పొగాకు కొనుగోలు అన్నదాతలకు ఏమాత్రం ఊరట ఇస్తాయనేది వేచి చూడాలి. పొదిలి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం గుంటూరు టుబాకో బోర్డు ఈడీ వి విశ్వశ్రీ ప్రారంభించారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రారంభ ధర రూ.30 లు తక్కువగా కిలో రూ.250 ధర పలకడంతో రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ ధరలు గిట్టుబాటు కాదని రైతులు వాపోతున్నారు. అధికారులు, బయ్యర్లు కుమ్మక్కై తమకు గిట్టుబాటు ధర లేకుండా చేస్తున్నారని రైతులు ఆరోపించారు. వేలం కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఈడీ విశ్వశ్రీ మీడియాతో మాట్లాడుతూ ఈ సంవత్సరం పంట చాల నాణ్యమైన దిగుబడివచ్చిందని, రైతులకు గిట్టుబాటు ధర కలుగుతుందని ఆమె తెలిపారు. ఇదే క్రమంలో తొలిరోజు ధరలు చూసి రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు. నాణ్యమైన పంట వచ్చిన కేవలం కిలో రూ 250 పలకడం ఏమిటని నిలదీశారు. గత సంవత్సరం కిలో రూ.280 తో ప్రారంభంకాగా ఈ సంవత్సరం ధరలు రైతులను కుదేలు చేస్తుందని ఆరొపించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి నాణ్యమైన పొగాకుకు కిలో రూ.300 ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.






## నగర ముఖచిత్రాన్ని మార్చేలా ప్రణాళికలు రూపొందించాలి



చేసేలా ఆలోచిస్తున్నట్లు తెలిపారు. తక్కువ నిర్వహణ ఖర్చుతో నగరానికి మరింత వన్నె తెచ్చేలా ఆయా సౌకర్యాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ చెప్పారు. అవసరమైతే భూ సమీకరణ విధానములో ముందుకు వెళ్తామన్నారు. ట్రంక్ రోడ్డులో చేపట్టే



అభివృద్ధి కార్యకలాపాల ప్రణాళికను 15 రోజుల్లోగా, మొత్తం నగరానికి అవసరమైన సమగ్ర ప్రణాళికను నెల రోజుల్లోగా రూపొందించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఇంజనీర్ ఐసయ్య, ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ తరపున చిలకమర్రి శ్రీకమల్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## ముఖ హాజరు పని ప్రదేశంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించండి

### ఎంపీడీవో బండారు శ్రీనివాస్‌కు వినతి పత్రం



### అందజేసిన ఫీల్డ్ అసిస్టెంట్లు

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, మార్చి 25)
యర్రగొండపాలెం మండలంలోని అన్ని గ్రామాల్లో పని జరుగు ప్రదేశంలో ఎదురవుతున్న సమస్యల గురించి స్థానిక ఎంపీడీవో బండారు శ్రీనివాస్ కు మండలంలో ఉన్న అన్ని పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లు కలిసి స్థానిక ఎంపీడీవో వినతి పత్రం సమర్పించారు. ఉపాధి హామీ పథకంలో కొత్తగా ప్రవేశపెట్టిన ఎన్ఎంఎంఎస్ ముఖ హాజరు యాప్ సాంకేతిక సమస్యల వలన పని ప్రదేశములో శ్రామికుల హాజరు అందరికి రావటం లేదు. ఈకేవైసీ చేసిన వారికే డిమాండ్ ఇచ్చి పనిలో పాల్గొన్న వారికి కూడా కొంత మంది శ్రామికుల ముఖ హాజరు తీసుకుంటుంది. కొంత మందికి ముఖ హాజరు ఫోటోలు రావడం లేదు. దీని వలన పనికి వచ్చిన శ్రామికులు వారు పని చేసిన కూడా హాజరు తీసుకోపోవటం వలన చాలా ఇబ్బంది పడుతున్నారు. అలాగే ఈ రోజు పనికి వచ్చిన వారికి హాజరు తీసుకుంటుంది. మరల వారి పేర్లు రేపు హాజరు లో తీసుకోవటం లేదు. దీని వలన పనిచేసే శ్రామికులు చాలా ఆందోళనకు గురి అవుతున్నారు. గ్రామంలోని శ్రామికులకు ఫీల్డ్ అసిస్టెంట్లు అయిన మేము సమాధానము చెప్పలేకపోతున్నాము. ఈ సమస్యను పరిష్కరించాలని ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంపీడీవో ను కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ అధ్యక్షుడు గంగినేని హనుమంతరావు చౌదరి, వెంకటేశ్వర్లు యాదవ్, కోటేశ్వరరావు, దయాకర్, రమేష్, బర్నబాస్, బసవయ్య, కాశయ్య, బుజ్జి, అమృతరాజ్, అంజి నాయక్, ఇతర ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి





డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాలలో మద్యం త్రాగే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఒంగోలు డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, మార్కాపురం డిఎస్పీ యు నాగరాజు, దర్శి డిఎస్పీ లక్ష్మీనారాయణ, డిసిఆర్బీ ఇన్స్పెక్టర్ దేవప్రభాకర్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు, పలు సబ్ డివిజన్ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## అద్దంకి నేతలతో మాజీ సీఎం జగన్ సమావేశం





# రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యం




**పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్ ద్వారా విస్తృత అవగాహన**
**జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు**
**జాతీయ రహదారుల పై జాగ్రత్తలు తప్పనిసరి**
**ప్రమాదాలను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు**
**ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా,**
**ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 25)**

జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించడం ప్రధాన లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు పలు వినూత్న చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా టోల్ గేట్లు, ఒంగోలు టౌన్, ఇతర ముఖ్య ప్రాంతాలలో పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్ ద్వారా వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ప్రత్యేకంగా ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్, చర్చి సెంటర్, మంగమూరు రోడ్డు, టంగుటూరు టోల్ గేట్‌తో పాటు జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్ పరిధుల్లో పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్ వినియోగించి వాహనదారులకు సూచనలు తెలియచేస్తున్నారు. ప్రజలతో మాట్లాడి రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను వివరిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు మీద వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కారు డ్రైవ్ చేసే వారు సీట్ బెల్ట్ ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదమని, ఇది మీ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు కలిగిస్తుందని హెచ్చరించారు. సర్వీస్ రోడ్డు నుండి జాతీయ రహదారిపై ప్రవేశించే సమయంలో తప్పనిసరిగా వాహనాన్ని ఆపి, ఇరువైపులా పరిశీలించి తర్వాత మాత్రమే ముందుకు సాగాలని సూచించారు. నిర్లక్ష్యంగా రోడ్డు దాటడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి వాహనదారుడు ఎడమ వైపునే ప్రయాణిస్తూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం అత్యంత ప్రమాదకరమని, అలాంటి పరిస్థితుల్లో జరిగే ప్రమాదాలు కుటుంబాలకు తీవ్ర విషాదాన్ని మిగులుస్తాయన్నారు. నేషనల్ హైవేపై నిర్దేశించిన ప్రదేశాలలోనే వాహనాలను పార్క్ చేయాలని, ఇతరులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డ్రైవింగ్ చేసే సమయంలో ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులను గుర్తు చేసుకొని, నిదానంగా, ప్రశాంతంగా ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్ ద్వారా ప్రజలకు నిరంతరం అవగాహన కల్పిస్తున్నామని, ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెరిగినప్పుడే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించగలమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామన్నారు.




# గంజాయి నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు



**అక్రమ రవాణా పై ప్రత్యేక దృష్టి సారించిన ప్రకాశం పోలీసులు**
**ఒంగోలు రైల్వే స్టేషన్‌లో, రైళ్లలో విస్తృత తనిఖీలు**
**సుమారు 13 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 25)**

గంజాయి వంటి మాదకద్రవ్యాల నిర్మూలనను లక్ష్యంగా పెట్టుకొని, ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుధాకర్, ఎస్ఐలు, స్పెషల్ పార్టీ, ఈగిల్ టీం, జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది సమన్వయంతో ఈ తనిఖీలు చేపట్టారు. మాదకద్రవ్యాలను గుర్తించే జాగిలం సహాయంతో ఒంగోలు రైల్వే స్టేషన్‌తో పాటు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల బోగీలు, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు, పార్సెల్ కేంద్రాలు తదితర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా కనిపించిన పార్సిళ్లు, ప్రయాణికుల బ్యాగులు మరియు ఇతర వస్తువులను ఒక్కొక్కటిగా పూర్తిగా పరిశీలించారు. ఈ క్రమంలో రైలు నెం.18189 ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్‌లో ఒంగోలు నుంచి కావలి వరకు పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో సుమారు 13 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. జార్ఖండ్ కు చెందిన శుకుల్ కుమార్ ఉరాన్, బలరామ్ ఉరన్స్, కమలేష్ ప్రసాద్ యాదవ్ ముగ్గురు అనుమానితులను ఉండే ప్రదేశంలో 6 కేజీల గంజాయిని, అదే విధంగా ఒడిషా, బెంగాన్, కలహండికు చెందిన చంద్రదొర, రఘునాథ్ దొర, రమేష్ దొర ఉండే ప్రదేశంలో 7 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని ఆరుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని, తదుపరి దర్యాప్తు నిమిత్తం జిఆర్‌పి పోలీసులకు అప్పగించారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలను రవాణా చేసే, విక్రయించే, వినియోగించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు. గంజాయి, మాదకద్రవ్యాల సమాచారం ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972, డయల్ 112, లేదా పోలీస్ వాట్సాప్ నంబర్ 9121102266 కు తెలియజేయవచ్చన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పోలీసులు తెలియజేశారు. ఈ తనిఖీలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుధాకర్, ఎస్ఐలు సుదర్శన్, చెంచయ్య, ఈగల్ టీం సిబ్బంది, డాగ్ హ్యాండ్లర్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది, సిబ్బంది పాల్గొన్నారు.

# ధర్మ మార్గంలో నడుచుకునే వారికి శ్రీ లలితా పరాభట్టారిక అనుగ్రహంతో అన్నీ విజయాలే

**ఆధ్యాత్మిక ఉపన్యాసకులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 25)**

వసంత నవరాత్రులనే లలితా నవరాత్రులు అంటారని ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు, స్వర్ణకంకణ గ్రహీత, ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసాలు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు. సంతపేట సాయిబాబా మందిరంలో జరుగుతున్న వసంత నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా వసంత నవరాత్రుల విశిష్టత గురించి ప్రసంగించారు. ప్రతి సంవత్సరం నాలుగు నవరాత్రులు జరుపుకోవడం హిందువుల సంప్రదాయమని అన్నారు. చైత్ర మాసంలో లలితా నవరాత్రులు, ఆశ్వయుజమాసంలో దేవి శరన్నవరాత్రులు, ఆషాడ మాసంలో వారాహి నవరాత్రులు, మాఘ మాసంలో శ్యామల నవరాత్రులు నిర్వహిస్తారని అన్నారు. శ్రీపరాభవ నామ సంవత్సరంలో పర అన్నపదం లలితా పరాభట్టారిక నామధేయమని తెలిపారు. భవ అంటే శివుడు అని ఈ సంవత్సరానికి ఆదిదేవతలుగా పార్వతీ పరమేశ్వరులు కొలువై ఉన్నారని అన్నారు. ధర్మ మార్గంలో నడుచుకునే వారికి శ్రీ పరాభవ నామ సంవత్సరంలో లలితాపరాభట్టారిక అనుగ్రహంతో అన్ని విజయాలే సిద్ధిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా ఉపన్యాసకుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు సతీమణి పద్మావతి దంపతులను వేద ఆశీర్వచనంతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంతపేట సాయిబాబా మందిరం అధ్యక్షులు అళహరి చంచలరావు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ గాయకులు ఐ.మురళీకృష్ణ, సంతపేట సాయిబాబా మందిరం మహిళా యువసేన అధ్యక్షురాలు దామచర్ల లక్ష్మి ప్రసన్న కుమారి, అక్కినేని కళాపరిషత్ అధ్యక్షులు కల్లగుంట కృష్ణయ్య, గాయకులు మొవ్వ నాగేశ్వరరావు, ఆధ్యాత్మిక ఉపన్యాసకులు అగస్త్యరాజు వెంకట శివ సుబ్రహ్మణ్యం, చిలకపాటి రంగారావు, అమిరపు కోదండరాం, రాంప్రసాద్, చిన్ని సుబ్రహ్మణ్య, ఏనుగుల సురేషబాబు, ఒరుగంటి ప్రసాద్ డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.









## రైతన్నా మీ కోసం
## రైతుల వద్దకు నాయకులు, కార్యకర్తలు

**40 సంవత్సరాల కల సాకారం**
**రైతులకు జీవనాధారం అయిన నీరు విడుదల**







**(షణ్ముఖ వెలుగు, దోర్నాల, మార్చి 25)**

మండలంలోని పెద్ద బొమ్మలాపురం గ్రామంలో జలవనరుల శాఖ ఆధ్వర్యంలో యర్రగొండపాలెం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పెద్దబొమ్మలాపురం గండిచెరువు నుండి వెన్నా పాపిరెడ్డి చెరువుకు సప్లై ఛానల్ ద్వారా నీటిని విడుదల చేయడం జరిగింది. అనంతరం చెరువు వద్ద నీటికి జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ పెద్దబొమ్మలాపురం ప్రాంత రైతులు దాదాపు 40 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న నీటి సమస్యకు నేడు పరిష్కారం లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ చెరువుల మధ్య సప్లై ఛానల్ ద్వారా నీటిని విడుదల చేయడం వల్ల ఈ ప్రాంతంలోని రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపడి, పంటల సాగు విస్తరించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే ఈ నీరు అందుబాటులోకి రావడం వల్ల వ్యవసాయానికి మాత్రమే కాకుండా పశువులకు తాగునీరు, గ్రామ ప్రజలకు అవసరమైన త్రాగునీటి వనరులు కూడా మెరుగుపడతాయనిలి పేర్కొన్నారు. రైతులు బాగుంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, రైతు సంక్షేమం కోసం ఎల్లప్పుడూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలం టీడీపీ కూటమి, బొమ్మలాపురం గ్రామ పార్టీ నాయకులు, రైతులు, అధికారులు, గ్రామ ప్రజలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కరేడు, చాకిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తనిఖీ





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మార్చి 25)**

మండల పరిధిలోని కరేడు, చాకిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బుధవారం జిల్లా మలేరియా అధికారి మధుసూదన్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ల్యాబ్‌కు సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. గ్రామాలలో ఎక్కడ వ్యాధులు ప్రబలకుండా చూసుకోవాలని రక్త పరీక్షలు కచ్చితంగా నిర్వహించాలని ల్యాబ్ టెక్నీషియన్‌కు సూచించారు. గ్రామాలలో జ్వరం వచ్చిన ప్రతి ఒక్కరికి రక్త పరీక్ష నిర్వహించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కరేడు వైద్యాధికారి అనిల్ కుమార్, చాకిచెర్ల వైద్యాధికారి డాక్టర్ ప్రనుత, ల్యాబ్ టెక్నీషియన్ మౌనిక, సబ్ యూనిట్ అధికారి భాస్కర్, సూపర్వైజర్ రవి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## జోన్ 4 కాపునాడు మహిళా అధ్యక్షురాలుగా కొల్లా భువనేశ్వరి



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, మార్చి 25)

కాపునాడు రాష్ట్రస్థాయి పర్యటనలో భాగంగా బుధవారం అద్దంకి నియోజకవర్గం విచ్చేసిన కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ళ సుబ్రమణ్యం చేతుల మీదుగా జోన్ 4 నూతన మహిళా కాపునాడు అధ్యక్షురాలిగా కొల్లా భువనేశ్వరిని నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు పోగులు మల్లికార్జునరావు, ఉమ్మడి ప్రకాశం జిల్లా జనరల్ సెక్రెటరీ దాసరి పిచ్చయ్య నాయుడు, ఉమ్మడి ప్రకాశం జిల్లా ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ మేకల నారాయణ, జిల్లా కాపు నాయకులు కొల్లా పవన్ కుమార్, వెంగలశెట్టి శ్రీనివాసులు (నాయుడు), డి బాబురావు, ఉమ్మడి ప్రకాశం జిల్లా యువజన నాయకులు నరసింహాశెట్టి విజయ్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## పశు వైద్య శిబిరం, లేగ దూడల ప్రదర్శన







(షణ్ముఖ వెలుగు, కొండపి, మార్చి 25)

మాలెపాడు గ్రామంలో అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్, కొండేపి, పశు సంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఒంగోలు ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం, మేలు జాతి లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మార్కెట్ యార్డ్ చైర్మన్ కర్ణ తిరుపతమ్మ, పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ బి మురళీకృష్ణ పాల్గొని రైతులకు లింగ నిర్ధారిత వీర్యం వలన జాతి లక్షణాలు కలిగిన పెయ్యి దూడలు మాత్రమే పుడతాయని వీటిని రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై రూ.150కు అందజేస్తుందని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 42 దూడలను ప్రదర్శన చేసి వాటిలో జాతి లక్షణాలు కలిగిన దూడను ఎంపిక చేసి బహుమతులు ఇవ్వడం జరిగింది. అదే విధంగా 22 పశువులకు గర్భకోశ వ్యాధులకు, తిరిగిపొర్లే పశువులకు ఉచితంగా చికిత్స చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులకు ఉచితంగా మినరల్ మిక్సర్ ప్యాకెట్లు, లివర్ టానిక్‌లు, దూడలకు నట్టల నివారణ మందులు అందించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు డాక్టర్ పి కోటేశ్వరరావు, డాక్టర్ జె శివరామకృష్ణ, ఏఎంసి సెక్రెటరీ జి రవికుమార్, పశుసంవర్ధక సహాయకులు మల్లీశ్వరి, పశువైద్య సిబ్బంది, గ్రామ నాయకులు కృష్ణారెడ్డి, మధు, చిన్నబ్బాయి, రైతులు పాల్గొన్నారు.

## ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ పై హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య



(షణ్ముఖ వెలుగు, చీరాల, మార్చి 25)

కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనపై చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో భారీ పరిశ్రమల స్థాపనతో ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని తెలిపారు. ఉక్కు పరిశ్రమలు ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు. అనుబంధ పరిశ్రమలు, ఎంఎస్ఎంఈ అభివృద్ధితో గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక చైతన్యం పెరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూల విధానాలు అమలు చేస్తుండటంతో రాష్ట్రానికి పెట్టుబడులు పెరుగుతున్నాయని వివరించారు. చీరాల నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

# మాడిఫైడ్ సైలెన్సర్, అనధికార లైటింగ్ అమర్చుకుని ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు

## జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు











(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మార్చి 25)

మాడిఫైడ్ సైలెన్సర్, అనధికార లైటింగ్ అమర్చుకుని ప్రజలకు, తోటి ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు హెచ్చరించారు. బైకులకు అధిక శబ్దం చేసే మాడిఫైడ్ సైలెన్సర్ల 100, అనధికార లైటింగ్ 400 లను రోడ్ రోలర్‌తో ధ్వంసం చేసారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు మీ భద్రతకే. ప్రతి వాహనదారుడు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సురక్షిత ప్రయాణానికి ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఒంగోలు టౌన్‌లో శబ్ద కాలుష్యం నియంత్రణతో పాటు రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా అమలు చేయాలనే లక్ష్యంతో గత నాలుగు నెలలుగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో భాగంగా ద్విచక్ర వాహనాలకు అమర్చిన అధిక శబ్దం చేసే 100కు పైగా మాడిఫైడ్ సైలెన్సర్లను తొలగించారు. అదేవిధంగా, ద్విచక్ర వాహనాలు మరియు ఆటోలకు ప్రభుత్వం అనుమతించిన ప్రమాణాలకు విరుద్ధంగా అధిక కాంతి వెలువరించే అనధికార లైటింగ్ అమర్చడం వల్ల ఎదురుగా వచ్చే వాహనదారులకు స్పష్టంగా కనిపించకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించిన పోలీస్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి 400కు పైగా హెడ్‌లైట్లను తొలగించారు. తొలగించిన మాడిఫైడ్ సైలెన్సర్లు, హెడ్‌లైట్లను ప్రకాశం జిల్లా ఎస్పీ బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో రోడ్ రోలర్‌తో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మోటార్ వాహనాల చట్టం నిబంధనలను ఉల్లంఘిస్తూ కంపెనీ తయారీ సైలెన్సర్ స్థానంలో అధిక శబ్దం చేసే సైలెన్సర్లను ఉపయోగించే వాహనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. ఒంగోలు టౌన్‌లో డీఎస్పీ ఆర్‌శ్రీనివాసరావు, ఒంగోలు టౌన్ సీఐలు, ట్రాఫిక్ సీఐ ప్రత్యేక దృష్టి పెట్టడం వల్ల శబ్ద కాలుష్యం కొంతమేర తగ్గిందన్నారు. అదే విధంగా ఎల్ఈడి లైట్లపై కూడా చర్యలు తీసుకున్నామని తెలిపారు. బైకులకు కంపెనీలు నిర్దేశించిన సైలెన్సర్‌లను తొలగించి ఇతర సైలెన్సర్‌లను అమర్చడం వల్ల శబ్ద, గాలి కాలుష్యం పెరుగుతుందని, ప్రజలకు అసౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. అనుమతి లేకుండా అధిక కాంతి వెలువరించే లైట్లు లేదా ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా అమర్చడం ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు మరియు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని, ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హైవేపై రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయడం, ఓవర్‌టేకింగ్ సమయంలో నిర్లక్ష్యం ప్రదర్శించడం వంటి చర్యలు ప్రమాదాలకు దారి తీస్తాయని హెచ్చరించారు. ట్రాఫిక్ నియమాలపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని, పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బైకులకు విపరీత శబ్దాన్నిచ్చే సైలెన్సర్ అమర్చుకుని శబ్ద కాలుష్యం సృష్టిస్తే చట్టపరమైన చర్యలు జరుగుతుందని, వాహనాలకు మాడిఫైడ్ సైలెన్సర్లను విక్రయించే షాపుల యజమానులు, వాటిని బిగించే మెకానిక్ లపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి డ్రైవ్‌లు కొనసాగుతాయని, మాడిఫైడ్ సైలెన్సర్‌లను ఉపయోగించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డిఎస్పి ఆర్ శ్రీనివాసరావు, ఏఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, ఒంగోలు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎస్ జగదీష్, ఒంగోలు తాలూకా సిఐ విజయ్ కృష్ణ, ఆర్ఐ సీతారామరెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐలు కోటయ్య, శ్రీనివాసులు, ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు.

## అనారోగ్యంతో సర్పంచ్ మృతి



(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, మార్చి 25)

మండలంలోని రామసముద్రం గ్రామానికి చెందిన ప్రస్తుతం సర్పంచ్‌గా విధులు నిర్వర్తిస్తున్న జినుకూటి ఏసేబు (65) అనారోగ్యంతో బుధవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఈయన ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు. ఆయన భౌతికాయానికి పలువురు వైసీపీ నాయకులు నివాళులర్పించారు.

## ఎమ్మెల్యే ముత్తుముల చొరవతో దశాబ్దాల భూ సమస్యకు పరిష్కారం

### ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన ప్రజలు

(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, మార్చి 25)

గిద్దలూరు పట్టణంలోని రేడియో బావి సెంటర్ వాసులు గత కొన్ని దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న ఓ ప్రధాన భూ సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. స్థానిక ఎమ్మెల్యే అశోక్ రెడ్డి విశేష కృషితో ఈ ఆస్తుల రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమమైంది. గిద్దలూరు పట్టణంలోని రేడియో బావి సెంటర్ ప్రాంతంలో సర్వే నెంబర్ 435/1 కింద అనేక ప్రైవేట్ ఆస్తులు, ఇళ్లు ఉన్నాయి. అయితే, గత కొన్ని దశాబ్దాలుగా ఈ భూములు పొరపాటున లేదా సాంకేతిక కారణాల వల్ల స్థానిక శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి ఆలయ భూముల జాబితాలో (నిషేధిత ఆస్తుల కింద) ఉండిపోయాయి. దీని కారణంగా దశాబ్దాలుగా అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ సొంత ఆస్తులను అత్యవసర పరిస్థితుల్లో అమ్ముకోవాలన్నా, కొత్తగా కొనుగోలు చేయాలన్నా లేదా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నా చట్టపరంగా వీలుకాక నానా అవస్థలు పడ్డారు. ఆస్తి పత్రాలు ఉన్నా, వాటి పై హక్కులు చెలాయించలేని నిస్సహాయ స్థితిలో ఆ ప్రాంత వాసులు ఉండిపోయారు. ఈ దీర్ఘకాలిక సమస్యను అక్కడి ప్రజలు గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల ఇబ్బందులను, వారి మనోవేదనను అర్థం చేసుకున్న ఎమ్మెల్యే ఈ సమస్య పరిష్కారానికి నడుంబిగించారు. ఈ సమస్య పరిష్కారం కోసం ఆయన పలుమార్లు జిల్లా కలెక్టర్‌ని స్వయంగా కలిసి పరిస్థితిని వివరించారు. రెవెన్యూ, దేవాదాయ శాఖల అధికారులతో సమీక్షలు జరిపి, అవి ప్రైవేటు ఆస్తులే అని నిరూపించేలా దస్త్రాలను పరిశీలించి, అధికారులకు తగిన ఆధారాలు సమర్పించడంలో ప్రజలకు అండగా నిలిచారు. ప్రభుత్వ స్థాయిలో నిరంతరం ఒత్తిడి తెచ్చి, ఈ ఫైలు ముందుకు కదిలేలా ఎంతగానో శ్రమించారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి నిరంతర కృషి ఫలించి సర్వే నెంబర్ 435/1 లో ఉన్న ప్రైవేటు వ్యక్తుల ఆస్తుల పై ఉన్న ఆంక్షలను తొలగిస్తూ జిల్లా కలెక్టర్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ తాజా ఉత్తర్వుల ప్రకారం, గిద్దలూరు తహసీల్దార్ వారు కూడా ఆన్లైన్ లో మార్పులు చేయటంతో ఇకపై ఆ ప్రాంత వాసులు ఎలాంటి ఆటంకాలు లేకుండా తమ ఆస్తులను అధికారికంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు, అలాగే క్రయవిక్రయాలు (అమ్మకాలు, కొనుగోళ్లు) స్వేచ్ఛగా జరుపుకోవచ్చు. కలెక్టర్ ఉత్తర్వులు వెలువడటంతో రేడియోబావి సెంటర్ ప్రాంత వాసుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఏళ్ల నాటి తమ ఆస్తుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించి, తమ కుటుంబాలకు అండగా నిలిచిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి ఆ ప్రాంత ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తమ దశాబ్దాల కల నెరవేర్చిన ఆయన సేవలను కొనియాడుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## జనాభా లెక్కల సేకరణకు ప్రజలు సహకరించాలి

### జనాభా లెక్కల అసిస్టెంట్ డైరక్టర్ ఎం శ్రీనివాసరావు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మార్చి 25)

జనాభా లెక్కల సేకరణకు ప్రజలు సహకరించాలని జనాభా లెక్కల అసిస్టెంట్ డైరక్టర్ ఎం శ్రీనివాసరావు అన్నారు. జనాభా లెక్కల సేకరణలో భాగంగా ఫీల్డ్ ట్రైనర్ల మూడు రోజుల శిక్షణలో భాగంగా బుధవారం ఒంగోలులో క్షేత్రస్థాయి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణను జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ ట్రైనర్స్ కు గృహ గణన చేసే విధానం, యాప్ లో నమోదు, సమాచార సేకరణ వంటి వివరాలను క్షేత్రస్థాయిలో ఎలా సేకరించాలి, ఎలా నమోదు చేయాలో వివరించారు. ఒంగోలు పట్టణంలో నాలుగు బృందాలతో క్షేత్రస్థాయి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఫీల్డ్ ట్రైనర్స్ శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయి శిక్షణ నిర్వహించడం జరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించడంలో ఎదురయ్యే సమస్యలు, యాప్ లో నమోదులో ఇబ్బందులను పరిష్కరించే లక్ష్యంతో ఈ శిక్షణ నిర్వహించడం జరుగుతోందన్నారు. ప్రజలు కూడా జనాభా లెక్కల సేకరణ సిబ్బందికి సమాచారం ఇచ్చి సహకరిస్తున్నారని చెప్పారు. డీఆర్వో చిన ఓబులేసు మాట్లాడుతూ, జిల్లాలోని ఫీల్డ్ ట్రైనర్లకు రెండు విడతలుగా శిక్షణ ఇస్తున్నామన్నారు. మొదటి విడతలో భాగంగా సిబ్బందికి క్షేత్రస్థాయిలో అవగాహన కోసం శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా సిబ్బంది 34 ప్రశ్నలకు సమాధానాలను యాప్ లో నమోదు చేయాలన్నారు. ప్రజలు అందరూ సిబ్బందికి సహకరించాలని కోరారు. మాస్టర్ ట్రైనర్ మురళి, ఇతర సిబ్బంది కూడా ఇందులో పాల్గొన్నారు.

# గంజాయి మత్తు మందుల నిర్మూలన కోసం ప్రజా ఉద్యమాలు నిర్మిద్దాం

## ఐద్వా రాష్ట్ర నాయకురాలు డి శ్రీనివాస కుమారి పిలుపు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 25)

యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి, మత్తుమందుల నిర్మూలన కోసం ప్రజా ఉద్యమాలు నిర్మిద్దామని, ప్రభుత్వాలను కదిలిద్దామని ఐద్వా రాష్ట్ర నాయకురాలు డి శ్రీనివాస కుమారి పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం ఐద్వా జిల్లా విస్తృత సమావేశం ఎస్కె మున్వర్ సుల్తానా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ కుమారి మాట్లాడుతూ "గంజాయి మత్తు మందులను నిర్మూలిద్దాం - భవిష్యత్తును కాపాడుకుందాం" అనే పేరుతో రాష్ట్రవ్యాప్తంగా రెండు నెలలపాటు పెద్ద ప్రచార ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రతిరోజు గంజాయి, మత్తు మందులను పోలీసు అధికారులు, ఈగల్ టీములు పట్టుకుంటున్నట్లు వార్తా కథనాలు వస్తున్నాయని అన్నారు. నిజానికి 20 శాతం మాత్రమే పట్టుబడుతున్నదని, 80% అది ప్రజల్లోకి చేరుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదికి సుమారు 25 వేల కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతున్నదని అనధికారిక లెక్కలు తెలుపుతున్నాయని అన్నారు. గంజాయి విచ్చలవిడిగా పెరగటానికి ఆ మత్తు మందుల వ్యాపారస్తులకు ప్రభుత్వ పెద్దలతోడ్పాటు ఉండటమే కారణమని అన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ వెనకాల గంజాయి వ్యాపారులు చేరుతున్నారని, అధికార పార్టీల నాయకులు ఇది పెద్ద ఆదాయం మార్గంగా ఈ వ్యాపారం సాగిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, వారి కుటుంబ సభ్యులు గంజాయి, మత్తు మందులతో పట్టుబడటం, డ్రగ్స్ సేవిస్తు పట్టుబడటం తరచూ చూస్తున్నామని అన్నారు. మత్తుమందులతో పట్టుబడ్డ ప్రజాప్రతినిధులను ఆయా పార్టీలు సస్పెండ్ చేయాలి వారిని బాధ్యతలనుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. విచిత్రంగా వారిని సంరక్షించే బాధ్యత ప్రభుత్వాలు చేస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వాలు మత్తు నిర్మూలన కోసం చిత్తశుద్ధితో పనిచేయట్లేదని అన్నారు. ప్రభుత్వాల మీద ప్రజా ఉద్యమాలు ఒత్తిడి తేవాలని తద్వారానే ఈ మహమ్మారిని నిర్మూలించగలమని అన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ నేటి యువతలో దేశభక్తి




బ , ా ఎ ా ల ు కొరవడుతున్నాయని, ఆ భావాలు పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. సమాజం పట్ల విద్యార్థులు, యువజనులకు బాధ్యత లేకపోతే దురల్వాట్ల వైపు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని అన్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో గంజాయి మత్తుమందులకు యువత బలవుతున్నారని, హై స్కూల్ స్థాయి పిల్లలలో కూడా మత్తుకు బానిసలవటం దురదృష్టకరమని అన్నారు. యువత మత్తుమందులకు బానిసై తమ భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. యువజన విద్యార్థి మహిళ ప్రజా సంఘాలను కలుపుకొని మత్తుకు వ్యతిరేకంగా ఉద్యమించాలని అన్నారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా నాయకులు నెరుసుల మాలతి, జి ఆదిలక్ష్మి, బి రాజ్యలక్ష్మి, ఎస్కె మల్లిక, ఎం పద్మ, టి లక్ష్మి, బంకా పద్మ, వై అంజనీదేవి, కె రాణి, ఎస్కె మస్తాన్ బి, ఎస్కె అస్మ, పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో హుండీ ఆదాయం రూ.10,81,510



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, మార్చి 25)

శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో బుధవారం హుండీల లెక్కింపు నిర్వహించారు. ఈ లెక్కింపు కార్యక్రమాన్ని ఆలయ కార్య నిర్వహణ అధికారి గొలమారి శ్రీనివాసులురెడ్డి, దేవాలయ ఇన్స్పెక్టర్ చైతన్య పర్యవేక్షణలో గతంలో 84 రోజులు గాను రూ.6,33,10లు రాగా ప్రస్తుతం 91 రోజులకు గాను రూ.10,81,510లు వచ్చినట్లు శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి గొలమారి శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

# తూతు మంత్రంగా మండల సర్వసభ్య సమావేశం




(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మార్చి 25)

పొన్నలూరు మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం బుధవారం తూతూ మంత్రంగా సాగింది. ఎంపీపీ కొండా బత్తిన మాధవరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఏఎంసి చైర్మన్ కర్ణ తిరుపతమ్మ, జడ్పిటిసి సభ్యులు బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో పి సుజాత హాజరయ్యారు. అధికారులు తమ శాఖల ద్వారా జరిగే పథకాలు అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ప్రజా ప్రతినిధులు సమస్యలపై చర్చించకుండా కేవలం అధికారుల ప్రసంగాలతో ముగించేశారు. సమస్యలపై ఎవరు చర్చించకపోవడంతో గంటలోపే సమావేశంలో ముగించారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్పర్సన్లు ఉన్నం కొండలరావు, మన్యం రమణయ్య, సర్పంచులు షేక్ చిన్న మస్తాన్, అనుమోలు ప్రసాద్, లెక్కల వెంకటేశ్వర్లు, రంగయ్య ఎంపీటీసీలు కాట్రగడ్డ నరసింహారావు, రామాంజనేయులు, ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు

# జిల్లాలో గ్యాస్ కొరత లేదు

**3389 సిలిండర్లు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి**
**గ్యాస్కు సంబంధించి వివరాలు తెలుసుకునేందుకు కంట్రోల్ రూమ్ నెం 9493247765**
**సింగిల్ సిలిండర్ ఉన్న వారు 25 రోజుల తర్వాతనే బుక్ చేసుకోవాలి**
**రెండు సిలిండర్లు ఉంటే 35 రోజుల తర్వాతనే బుక్ చేసుకోవాలి**
**డిఎస్ఓ జమీర్ బాషా**




(షణ్ముఖ వెలుగు, బాపట్ల, మార్చి 25)

పట్టణంలోను, గ్రామీణ ప్రాంతాల్లో అయిన సింగిల్ సిలిండర్ ఉన్న వారు 25 రోజుల తర్వాత, డబుల్ సిలిండర్లు ఉన్న వారు 35 రోజుల తర్వాత బుక్ చేసుకోవచ్చునని డిఎస్ఓ ఆర్ జమీర్ బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 27 గ్యాస్ ఏజెన్సీలకు సంబంధించి ప్రత్యేక అధికారులు, అలాగే సంబంధిత డివిజనల్ స్థాయిలో పర్యవేక్షణాధికారులుగా నియమించమన్నారు. జిల్లా మరియు డివిజనల్ స్థాయిలో కంట్రోల్ రూములను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అసత్య ప్రచారాలు నమ్మి వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వినియోగదారుల అవసరాలకు తగిన విధంగా యల్.పి.జి. గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉండేలా పటిష్ట చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. గ్యాస్ కంపెనీల ద్వారా సరఫరా సాధారణంగానే కొనసాగుతుందని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్యాస్ కొరత వస్తుందనే ఉద్దేశంతో వెంట వెంటనే ఆన్లైన్లో గ్యాస్ బుకింగ్ చేయడానికి వెబ్ పోర్టల్ అనుమతించదని కేవలం పట్టణనాలలోను గ్రామీణ ప్రాంతాల్లో సింగిల్ సిలిండర్ ఉన్న వారు 25 రోజులు, డబుల్ సిలిండర్లు ఉన్న వారు 35 రోజుల తర్వాత మాత్రమే గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని బుక్ చేసిన తర్వాత 7 రోజుల్లోగా సిలిండర్లు వస్తున్నదని వినియోగదారులకు సూచించారు. సంక్షేమ వసతి గృహాలు, ఇతర అత్యవసర సేవలకు గ్యాస్ సరఫరాలో నిలుపుదల ఉండదని స్పష్టం చేశారు. అవసరానికి మించి గ్యాస్ సిలిండర్ల ను నిల్వ చేయడం లేదా కొనుగోలు చేయడం చేయరాదన్నారు. ప్రభుత్వం, జిల్లా పాలన యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తున్నాయన్నారు. ప్రజలు అపోహలను నమ్మకుండా అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలన్నారు. గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లను (14.21కిలోలు) వాణిజ్య అవసరాల కోసం తరలించిన, వినియోగించిన అట్టి వారి పై నిత్యావసరాల చట్టం 1955, ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్ఓ ఆ ప్రకటనలో తెలిపారు.

# ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్

## ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్ నిర్మలమ




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 25)

ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం నందు పూజా కంప్యూటర్స్, ఆంధ్ర కేసరి కంప్యూటర్ సైన్స్ డిపార్ట్మెంట్ సంయుక్తంగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ డేటా సైన్స్ మీద అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంను విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి ఆదేశాల మేరకు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యాలయా రిజిస్టర్ హరిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని వివిధ రంగాలపై ఏఐ టెక్నాలజీ ప్రభావం గురించి తెలిపారు. యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నిర్మల మణి మాట్లాడుతూ ముఖ్యంగా పరిశోధనలలో ఏఐ టెక్నాలజీ తెచ్చిన విప్లవత్మక మార్పులు గూర్చి తెలిపారు. తదుపరి డాక్టర్ సీఎం సువర్ణ వర్మ మాట్లాడుతూ మిషన్ లెర్నింగ్ డీప్ లర్నింగ్ మార్షల్ నెట్వర్క్ మొదలగు టెక్నాలజీస్ మన దైనందిని జీవితంలో తెచ్చిన మార్పుల గురించి వివరించారు. తదుపరి యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ రాజ్మోహన్ మాట్లాడుతూ క్వాంటం టెక్నాలజీ గూర్చి వివరించారు. అంతర్జాతీయ సదస్సుకు పూజా కంప్యూటర్ చైర్మన్ కాలే వెంకటేశ్వర్లు డైరెక్టర్ కె మస్తాన్రావు, చీరాల ఇంజనీరింగ్ కాలేజ్ సీఈఓ ఎం వేణు, యూనివర్సిటీ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ జి సోమశేఖర్, పేస్ ఇంజనీరింగ్ కాలేజ్ హెచ్ఓడి జి లక్ష్మి వరప్రసాద్, యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ డిపార్ట్మెంట్ అధ్యాపకులు కేవీ సాయిబాబ, కెవి నారాయణ, ప్రభావతి, నాగార్జున డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ యోగయ్య చౌదరి, విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మండే హర్ష ప్రీతం, దేవ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. ఈ సదస్సులో సాహితీ ఆదిత్య కాలేజ్ హారిక ఫేస్ కాలేజ్ ప్రణీత్, ఏకేయూ యూనివర్సిటీ రాజ్యలక్ష్మి ఉత్తమ ప్రతిభ కనబరిచి నగదు బహుమతులు పొందారు. ఈ సదస్సు అంతటికి ప్రొఫెసర్ జి రాజమోహన్ అధ్యక్షత వహించారు.

# ఆంధ్రప్రదేశ్‌లో పియం ఉపాధి కల్పనా కార్యక్రమం

## అమలు పై మాగుంట ప్రశ్న

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 25)



ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన మంత్రి ఉపాది కల్పనా కార్యక్రమం క్రింద గత 5 సంవత్సరాలలో ప్రతిపాదించిన, మంజూరైన, పనిచేయుచున్న యూనిట్లు, లబ్దిదారులు, యూనిట్ల పెంపుదల గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఆయన అడిగిన ప్రశ్నకు కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖ సహాయక మంత్రి, సుశ్రీ శోభ కరండ్ల సమాధానమిస్తూ గ్రామీణ ప్రాంతాలలో ముఖ్యంగా సామర్థ్యం కల సాంప్రదాయ హస్త కళాకారులకు, నిరుద్యోగ యువతకు సుస్థిర ఉపాధి అవకాశాలను కల్పించడం ఈ కార్యక్రమ ముఖ్య లక్ష్యమని, కొత్త సూక్ష్మ-చిన్న-మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు వారికి ఆర్థిక సహాయం అందించబడునని తెలిపారు. అనేక ప్రధాన రంగాలు, పరిశ్రమలు అనగా వ్యవసాయ, అటవీ, ఆధారిత, ఆహార శుద్ధి, పేపర్, ఫైబర్ చేతి తయారీ, ఖనిజ, రసాయన పరిశ్రమలకు, సాంకేతికత, ఇంజనీరింగ్, సేవ, వస్త్ర కార్యకలాపాలకు కూడా ఆర్థిక సహాయం అందించబడునని తెలిపారు. ఈ కార్యక్రమం క్రింద పరిశ్రమల స్థాపనకు ఆంధ్రప్రదేశ్ లో మంజూరైన యూనిట్లకు లాభ సాధ్యతను బట్టి సంబందిత బ్యాంకులు అప్పులు మంజూరు చేస్తుండగా, ప్రభుత్వం సబ్సిడీ మంజూరు చేస్తుందని తెలిపారు. గత 5 సంవత్సరాలలో ఈ కార్యక్రమం క్రింద దేశం మొత్తంలో సహాయం పొందిన యూనిట్లలో 5 శాతంతో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉన్నదని తెలిపారు. ఈ కార్యక్రమం క్రింద, 2020-21 నుండి 2024-25 సం.లో ఆంధ్రప్రదేశ్‌కు మంజూరైన 29,569 ప్రాజెక్టులు క్రింద, 16,053 యూనిట్లు అప్పు, సబ్సిడీ పొందగా ప్రకాశం జిల్లాలో మంజూరైన 1,785 ప్రాజెక్టులు క్రింద 1,028 యూనిట్లు అప్పు, సబ్సిడీ పొందాయని కేంద్ర మంత్రి తెలిపారు.

# రూ.14 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన



(షణ్ముఖ వెలుగు, వేటపాలెం, మార్చి 25)

మండలంలోని చల్లారెడ్డి పాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని పొట్టి సుబ్బయ్య పాలెంలో బుధవారం రూ.14 లక్షలతో సిసి రోడ్లు నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఇ రామచంద్రుడు, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కీర్తి పూర్ణ, పంచాయతీ సెక్రటరీ సంపత్ కుమార్ లు పాల్గొని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కీర్తిపూర్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరంలోనే తమ ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య నేతృత్వంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. గత ప్రభుత్వం హయాంలో అభివృద్ధి శూన్యంగా మారిందని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల అవసరతలను గుర్తించి అభివృద్ధి పనులు చేపట్టామని కీర్తి పూర్ణ చెప్పారు. తమ యువ నాయకులు నియోజకవర్గ అధికార ప్రతినిధి మద్దూరి మహేంద్రనాథ్ సహకారంతో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మయ్య, మస్తాను, కటారి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## లాయర్‌పేటలో మరుగుదొడ్ల ఏర్పాటు








(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 25)

స్వచ్ఛ భారత్ – స్వచ్ఛ ఒంగోలు నగరంలో భాగంగా, నగరంలోని రద్దీ ప్రాంతాలలో ఒకటి అయినా లాయర్ పేట రైతుబజార్ ప్రాంతం నందు లోటస్ సొసైటీ వారిచే నూతనంగా ఏర్పాటు చేసిన మరుగుదొడ్లను బుధవారం ఒంగోలు నగరపాలక సంస్థ కమీషనర్ డాక్టర్ కె వెంకటేశ్వరరావు, ఏసయ్యతో కలిసి ప్రారంభించారు. అనంతరం కమీషనర్ మాట్లాడుతూ నగరంలో రద్దీ ప్రాంతాలు అయినా రైల్వే స్టేషన్ దగ్గర లోటస్ సొసైటీ వారు సుమారు రెండు నెలల క్రితం స్వచ్ఛ టాయిలెట్స్ నిర్మించారన్నారు. ఇపుడు లాయర్ పేట రైతుబజార్ జంక్షన్‌లో మరొక స్వచ్ఛ టాయిలెట్స్‌ని ఏర్పాటు చేసి నేటి నుంచి ఉపయోగంలోకి తీసుకురావటం జరిగిందని తెలిపారు. త్వరలో అద్దంకి బస్టాండ్ ఏరియాలో కూడా ప్రజల అవసరాల కోసం ఇంకొక స్వచ్ఛ టాయిలెట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగరపాలక సంస్థ కమీషనర్ డాక్టర్ కె వెంకటేశ్వరరావుతో పాటు వీజు ఏసయ్య, లోటస్ సొసైటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ గోదాములపై పోలీసుల ఆకస్మిక తనిఖీలు

### గ్యాస్ బ్లాక్‌లో అమ్మితే కఠిన చర్యలు తప్పవు
### సీఐ మల్లికార్జున





(షణ్ముఖ వెలుగు, కంభం, మార్చి 25)

మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు గ్యాస్ సిలిండర్లు బ్లాక్‌లో విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో కంభం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున ఆధ్వర్యంలో కంభం ఎస్ఐ శివకృష్ణారెడ్డి, బేస్తవారిపేట ఎస్ఐ రవీంద్రారెడ్డి సంయుక్తంగా కంభం, బేస్తవారిపేట మండలాల్లోని గ్యాస్ గోదాముల పై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భద్రతా ప్రమాణాలు, లైసెన్స్ నిబంధనలు, నిల్వ విధానాలు, అగ్ని ప్రమాద నివారణ చర్యలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. గ్యాస్ ఏజెన్సీలు ఎలాంటి అక్రమాలు చేయకుండా, ప్రభుత్వ నియమాలను కచ్చితంగా పాటించాలని గోదాం యజమానులకు కఠిన హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలకు సరఫరా చేయాల్సిన గ్యాస్‌ను బ్లాక్‌లో అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని, ఇటువంటి అక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టి తనిఖీలు కొనసాగిస్తామని పోలీసులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అద్దంకి నియోజకవర్గ గృహ నిర్మాణ పురోగతి పై మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమీక్ష

**సెప్టెంబర్ 2026 లోపు పెండింగ్ గృహాలన్నీ పూర్తి కావాలి**
**నియోజకవర్గంలో 4,010 గృహాలు పూర్తి**
**మరో 2,700 వివిధ దశల్లో పీఎంఏవై 2.0 కింద నిలిచిపోయిన**
**107 గృహాలను వెంటనే ప్రారంభించాలి**

(షణ్ముఖ వెలుగు, అద్దంకి, మార్చి 25)

అద్దంకి నియోజకవర్గంలో గృహ నిర్మాణ పురోగతిపై విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హౌసింగ్ డీహెచ్‌హెచ్ పి శ్రీనివాస ప్రసాద్, డీఈఈ ఎంవివిఎస్ దుర్గా రమేష్, ఏఈలతో కలిసి నియోజకవర్గ వ్యాప్తంగా గృహ నిర్మాణ దశలను మంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. నియోజకవర్గంలో 1.0 కింద మొత్తం 6,710 గృహాలు మంజూరు కాగా, ఇప్పటివరకు 4,010 గృహాలు పూర్తయ్యాయని, మిగిలిన 2,700 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయని మంత్రి తెలిపారు.

**మండలాల వారీగా పురోగతి వివరాలు**

అద్దంకి మండలంలో మొత్తం 645 గృహాలు మంజూరు కాగా, 361 గృహాలు పూర్తయ్యాయి. మిగిలిన 284 గృహాలలో బేస్మెంట్ దశలో 251, లింటెల్ దశలో 8, రూఫ్ లెవల్‌లో 25 గృహాలు ఉన్నాయి. బల్లికురవ మండలంలో మొత్తం 1,033 గృహాలు మంజూరు కాగా, 686 గృహాలు పూర్తయ్యాయి. మిగిలిన 347 గృహాలలో బేస్మెంట్ దశలో 266, లింటెల్ దశలో 49, రూఫ్ లెవల్‌లో 32 గృహాలు ఉన్నాయి. జె పంగులూరు మండలంలో మొత్తం 1,006 గృహాలు మంజూరు కాగా, 615 గృహాలు పూర్తయ్యాయి. మిగిలిన 434 గృహాలలో బేస్మెంట్ దశలో 330, లింటెల్ దశలో 21, రూఫ్ లెవల్‌లో 75 గృహాలు ఉన్నాయి. కొరిశపాడు మండలంలో మొత్తం 863 గృహాలు మంజూరు కాగా, 429 గృహాలు పూర్తయ్యాయి. మిగిలిన 410 గృహాలలో బేస్మెంట్



దశలో 199, లింటెల్ దశలో 145, రూఫ్ లెవల్‌లో 66 గృహాలు ఉన్నాయి. సంతమాగులూరు మండలంలో మొత్తం 1,090 గృహాలు మంజూరు కాగా, 680 గృహాలు పూర్తయ్యాయి. మిగిలిన 834 గృహాలలో.. బేస్మెంట్ దశలో 710, లింటెల్ దశలో 24, రూఫ్ లెవల్‌లో 102 గృహాలు ఉన్నాయి. అద్దంకి అర్బన్ పరిధిలో 2,073 గృహాలు మంజూరు కాగా, 1,239 గృహాలు పూర్తయ్యాయి. మిగిలిన గృహాల్లో 322 లింటెల్ దశలో, 302 రూఫ్ లెవల్ దశలో ఉన్నాయని అధికారులు వివరించారు.

**అదనపు ఆర్థిక సాయం – బిల్లుల చెల్లింపు**

ప్రభుత్వం ప్రతి ఇంటికి ఇచ్చే రూ.1.80 లక్షల ఆర్థిక సాయంతో పాటు బిసి, ఎస్సీలకు రూ.50వేలు, రూ.75వేలు అదనపు సాయం అందజేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతం నిధుల కొరత లేదని, పనులు జరిగిన వెంటనే బిల్లులు సకాలంలో లబ్ధిదారులకు చెల్లిస్తున్నామని స్పష్టం చేశారు.

**పీఎంఏవై 2.0 ఆదేశాలు**

పీఎంఏవై 2.0 కింద అద్దంకి అర్బన్ కు 174 గృహాలు మంజూరు కాగా, ఇంకా 107 గృహాలు ప్రారంభించాల్సి ఉందని, వీటిని వెంటనే మొదలుపెట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.



## ఉత్తరాంధ్ర అభివృద్ధికి స్టీల్ ప్లాంట్ కొత్త మైలురాయి

### మిత్తల్ స్టీల్ ప్లాంట్‌తో ఇండస్ట్రియల్ హబ్‌గా మంత్రి లోకేష్ కృషితో భారీ పెట్టుబడి సాధ్యం
### ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

(షణ్ముఖ వెలుగు, పర్చూరు, మార్చి 25)

ఉత్తరాంధ్ర అభివృద్ధికి దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న భారీ పారిశ్రామిక ప్రాజెక్టుకు శంకుస్థాపన జరగడం రాష్ట్రానికి గర్వకారణమని, మిత్తల్ స్టీల్‌ప్లాంట్ ఉత్తరాంధ్రను ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చనుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్–నిప్పాన్ స్టీల్ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న ప్రపంచ స్థాయి సమీకృత ఉక్కు కర్మాగారానికి శంకుస్థాపన కార్యక్రమం పారిశ్రామిక చరిత్రలో కీలక ఘట్టమని పేర్కొన్నారు. రూ.1.35 లక్షల కోట్లకు పైగా పెట్టుబడితో నిర్మితమయ్యే ఈ ప్రాజెక్టు దేశంలోనే అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్రాజెక్టులలో ఒకటిగా నిలుస్తుందని ఆయన చెప్పారు. ఈ ప్లాంట్ ద్వారా లక్షకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు సృష్టించబడతాయని, స్థానిక యువతకు దీర్ఘకాలిక ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. మంత్రి నారా లోకేష్ పెట్టుబడిదారులతో నిరంతర చర్చలు జరిపి, వేగవంతమైన అనుమతులు కల్పించడం వల్లే ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు రావడం సాధ్యమైందని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. పారదర్శక విధానాలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వంటి సంస్కరణలు పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచాయని అన్నారు. యువతకు ఉపాధి కల్పననే లక్ష్యంగా 'జాబ్స్ ఫస్ట్' దృక్పథంతో మంత్రి లోకేష్ ముందుకు తీసుకువచ్చిన ప్రాజెక్టు ఇది. ఇది కేవలం ఒక పరిశ్రమ కాదు, ఆంధ్రప్రదేశ్ యువత భవిష్యత్తును మార్చే ఉపాధి యంత్రం అని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టుతో ఉత్తరాంధ్ర ప్రాంతం వేగంగా ఇండస్ట్రియల్ హబ్‌గా మారుతుందని, పోర్ట్, రహదారి, రైల్వే మౌలిక వసతులు మరింత మెరుగుపడతాయని తెలిపారు. అనుబంధ పరిశ్రమలు, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు కూడా ఈ ప్రాజెక్టు ఊతమిస్తుందని చెప్పారు. విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేసే దిశగా ఈ స్టీల్ ప్లాంట్ కీలక పాత్ర పోషిస్తుందని, రాష్ట్ర జీడీపీ వృద్ధి, పారిశ్రామిక విస్తరణ, పెట్టుబడుల ప్రవాహం పెరగడానికి ఇది దోహదం చేస్తుందని అన్నారు. ఈ ప్రాజెక్టు రెండు దశల్లో పూర్తికానుంది. మొదటి దశలో ఏడాదికి 7.3 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్ పనిచేయనుండగా, రెండో దశలో దీన్ని 10.5 మిలియన్ టన్నులకు పెంచనున్నారని, 2030 నాటికి తొలి బ్లాస్ట్ ఫర్నేస్ ప్రారంభమవుతుందని అధికారులు భావిస్తున్నారని తెలిపారు. ఈ స్టీల్ ప్లాంట్‌తో పాటు 50 ఎంటీపీఏ సామర్థ్యంతో క్యాప్టివ్ పోర్టును కూడా ఏర్పాటు చేయనున్నారని, రూ.11,192 కోట్లతో నిర్మించే ఈ పోర్ట్ ద్వారా లాజిస్టిక్స్ రంగానికి భారీ ఊతం లభించడంతో పాటు వేలాది మందికి ఉపాధి అవకాశాలు కలుగనున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్న పారిశ్రామిక విధానాల వల్లే ప్రపంచస్థాయి కంపెనీలు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నాయని ఎమ్మెల్యే ఏలూరి అన్నారు. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులపై ఇతరులు క్రెడిట్ తీసుకోవాలని ప్రయత్నించడం దురదృష్టకరమని, అభివృద్ధి కార్యక్రమాలపై రాజకీయాలు చేయడం సరైంది కాదని ఆయన సూచించారు. రాష్ట్రానికి మేలు జరిగితే అందరూ కలిసి స్వాగతించాలి. కానీ కొందరు రాజకీయ ఈర్ష్యతో అభివృద్ధిని కూడా తక్కువ చేసి చూపేందుకు ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే ఏలూరి వ్యాఖ్యానించారు.

## కూటమి ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ కి పారిశ్రామిక కళ

### విలేకర్ల సమావేశంలో జిడిసిసి బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు




(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మార్చి 25)

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ప్రాజెక్టులను పూర్తి చేస్తూ, భారీగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందని, రాబోయే 15 ఏళ్ల పాటు కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని ఉమ్మడి గుంటూరు జిల్లా జిడిసిసి బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు స్పష్టం చేశారు. బుధవారం వినుకొండలోని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్, నిప్పాన్ స్టీల్ సంయుక్తంగా సుమారు రూ. 1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనతో ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కొత్త యుగం మొదలైందని హర్షం వ్యక్తం చేశారు. మంత్రి నారా లోకేష్ కేవలం ఒక జూమ్ కాల్‌తో ఇంతటి భారీ ప్రాజెక్టును రాష్ట్రానికి తీసుకురావడం అభినందనీయమని ప్రశంసిస్తూ, ఈ ప్లాంట్ ఏపీ యువత భవిష్యత్తును మార్చే ఒక "ఉపాధి యంత్రం" అని కొనియాడారు. ఇదే క్రమంలో వినుకొండ నియోజకవర్గాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు గారు ఎంతో అభివృద్ధి చేస్తున్నారని మక్కెన ప్రశంసించారు. రెండు దశల్లో నిర్మితమయ్యే ఈ ప్లాంట్ ద్వారా 2030 నాటికి పూర్తిస్థాయి ఉత్పత్తి ప్రారంభమవుతుందని, దీనికి అనుబంధంగా నిర్మించే క్యాప్టివ్ పోర్టు ద్వారా అదనంగా మరో 6 వేల మందికి ఉద్యోగాలొస్తాయని వివరించారు. ఈ సమావేశంలో వినుకొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ మీసాల మురళీకృష్ణ యాదవ్, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొంకూరి రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర హోటల్స్ యజమానుల సమస్యల పై పరిష్కరించేందుకు కృషి ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 25)

రాష్ట్ర హోటల్స్ యజమానుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి పరిష్కారం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని స్థానిక శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు అన్నారు. నగరంలోని మంగమ్మ కాలేజీ వద్ద గల శ్రీ కన్వెన్షన్ హాల్లో (టంగుటూరి సుబ్బమ్మ వేదిక) ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ హోటల్స్ యజమానుల అసోసియేషన్ కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అసోసియేషన్ సభ్యులు జీఎస్టీ సమస్యను తీసుకువచ్చారని దానిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా అన్నారు. ఇటీవల కాలంలో యుద్ధం జరుగుతున్నందున గ్యాస్ కొరత ఏర్పడిందని ఆయన హోటల్స్ ఎలాంటి అసౌకర్యం లేకుండా చూసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని అన్నారు. ఎలాంటి సమస్యలు వచ్చిన వెంటనే తమ దృష్టికి తీసుకొస్తే సానుకూలంగా స్పందించి పరిష్కారం చేస్తాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి శ్రీనివాసరావు, కార్యదర్శి కె రమణ, కార్యనిర్వాహక కార్యదర్శి వై కొండయ్య, కోశాధికారి బి లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షులు ఎం శ్రీనివాసులు, కేబీ వీరయ్య, రాష్ట్ర అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.





On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# ఏడోవ బెటాలియన్ సందర్శన దాతల సహకారం అభినందనీయం




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మార్చి 25)
గ్రోత్ సెంటర్లో గల పారిశ్రామికవాడ వెనుక వైపున ఉన్న బెటాలియన్‌ను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్చి, అప్రోచ్ రోడ్డును ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీఎస్ పి బెటాలియన్స్ ఐజిపి రాజకుమారి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సివిల్ పోలీస్‌కి ఏఆర్, ఏపీఎస్పీ బెటాలియన్ రెండు కళ్ళు లాంటివి అన్నారు. ఏ చిన్న సమస్య ఎదురైనా ముందుగా గుర్తొచ్చేది పోలీసులేనన్నారు. అన్ని విభాగాలను కలుపుకుంటూ ముందుకెళుంటారు అన్నారు. పోలీసులంటే అందరివారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఏపీఎస్పీ బెటాలియన్ విరివిగా సేవలందిస్తుందన్నారు. రాష్ట్రంలోనే సెవెంత్ బెటాలియన్ ఎక్కువ విస్తీర్ణంలో ఉందన్నారు. తాను పదేళ్ల కిందట ఇక్కడికి వచ్చినప్పుడు ఈ ప్రాంతమంతా నిర్మానుష్యంగా ఉండేదన్నారు. ఇక్కడికి రావడానికి కూడా ఇబ్బందిగా ఉండేది అన్నారు. అలాంటి ఏరియా ఇప్పుడు ఎంతో ఆహ్లాదకరంగా ఉందని తెలిపారు. ఇందుకు సహకరించిన దాతలను, ఇతర శాఖల అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. రెండు,మూడు ఏళ్లలో ఇక్కడ పూర్తిస్థాయి అడ్మినిస్ట్రేషన్ ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అదే విధంగా బెటాలియన్ రూపురేఖలను మార్చడంలో విశేషంగా కృషిచేసిన సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం బెటాలియన్ అభివృద్ధికి సహకరించిన దాతలను శాలువాలతో సత్కరించారు. ముందుగా ఆర్చి, అప్రోచ్ రోడ్డును ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. బెటాలియన్ కి కేటాయించిన వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. అదేవిధంగా బెటాలియన్ ప్రాంగణమంతా పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ జనార్దన్‌రెడ్డి, కమాండెంట్ అధికారి మురళి, బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ శాంతిరాజు, ఒంగోలు డిఎస్‌పి రాయపాటి శ్రీనివాసరావు, ఒంగోలు రూరల్ సీఐ శేషగిరిరావు, ఎస్ఐ వెంకట సూర్య, దాతలు పోతినేని శ్రీనివాసరావు, మన్నెం రామారావు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు సిబ్బంది, పాల్గొన్నారు.

## ఏపీఎస్ పి బెటాలియన్స్ ఐజిపి రాజకుమారి బెటాలియన్ ఆర్చి, సర్వీస్ రోడ్డు ప్రారంభం పోతినేని శ్రీనివాసరావును సన్మానించిన ఐజి పి రాజకుమారి








## మంత్రి ఆదేశాలతో లోఓల్టేజీ సమస్య పరిష్కారం

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మార్చి 25)



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి ఆదేశాల మేరకులో ఓల్టేజి సమస్యకు పరిష్కారం చూపారు. లో ఓల్టేజీ సమస్యతో బాధపడుతున్న వెల్లటూరు పంచాయతీలోని



మంగపతివారిపాలెం గ్రామంలో సింగిల్ ఫేస్ ట్రాన్సఫర్మార్ ఓసీ కాలనీలో ఒకటి, ఎస్సీ, బిసి కాలనీలో మరొకటి రెండింటిని కొత్తవి ఏర్పాటు చేశారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్‌లను బుధవారం ముప్పాళ్ల సొసైటీ చైర్మన్ మన్నెం రమణయ్య చేతుల మీదుగా ప్రారంభించారు. దీంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేసారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ పొన్నలూరు ఏఈ వీరాంజనేయులు, ఇతర సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## శ్రీ కాశీక్షేతస్వామి తృతీయ వార్షికోత్సవాన్ని జయప్రదం చేయాలి



### ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ రామణ బోయిన మురళి యాదవ్

(షణ్ముఖ వెలుగు, బద్వేల్, మార్చి 25)



బద్వేలు పట్టనంలోని శ్రీకృష్ణ దేవరాయనగర్, త్యాగరాజు నగర్లో వెలసిన శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి స్పటిక శివాలయం వార్షికోత్సవ వేడుకలలో భూనులు పాల్గొని జయప్రదం చేయాలని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ రామనబోయిన మురళీయాదవ్ మరియు పలువురు కమిటి సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి సభ్యులు మాట్లాడుతూ కడపజిల్లాలో ఎక్కడా లేనివిధంగా త్యాగరాజు కాలనీలోని 27 అంగుళాల రాశి విశ్వేశ్వర స్వామి ఆలయం నిర్మించి 3 సంవత్సరాలు కావస్తుందని కావున ఈనెల 28 నుంచి 29వ వరకు తృతీయ వార్షికోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా 28వ తేది శనివారం మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, గణపతిరుద్ర సుదర్శన చండీహోమ కార్యక్రమాలు, రాత్రి గొప్ప హరికథ కార్యక్రమం, 29వ తేది ఆదివారం 10 గంటలకు రాశీ విశాలాక్షి సమేత శ్రీ కాశి విశ్వనాథ స్వామి కళ్యాణ మహోత్సవం వేదపండితులు బ్రహ్మశ్రీ సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహిం కావున భూదులందరూ పాల్గొని వార్షికోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.



## గ్రామ నీటి భద్రత పై శిక్షణ



(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, మార్చి 25)
మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు గ్రామ నీటి భద్రతపై మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రంగ సుబ్బారాయుడు, డిప్యూటీ ఎంపీడీవో పాల్గొన్నారు.

## సురేష్ రెడ్డికి సత్కారం



(షణ్ముఖ వెలుగు, పొదిలి, మార్చి 25)
పొదిలి నగర పంచాయతీ ఆర్టీసీ డిపోలో దాత కె విజయభాస్కర్‌రెడ్డి సహకారంతో ఆర్వో ప్లాంట్ ప్రారంభానికి ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మైనారిటీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాదర్ బాషా, విజయ భాస్కర్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

# ఒక్క రోజులో కోటి రూపాయల పన్ను వసూలు


### కమిషనర్ కోడూరు వెంకటేశ్వరరావు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 25)
ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలో బుధవారం ఒక్క రోజున కోటి రూపాయలకు పైగా పన్ను వసూళ్లను సాధించినట్లు నగరపాలక సంస్థ కమీషనర్ కోడూరు వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ కమీషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నగరపాలక సంస్థలోని అన్ని సచివాలయములలోని సిబ్బంది అందరూ కూడా నగరపాలక సంస్థకి చెల్లించవలసిన పన్ను బకాయిల కొరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అలానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము జారీ చేసిన జిఓఎంఎస్ నెం.58 ప్రకారం ఆస్తి పన్ను బకాయిల వడ్డీ పై 50% రాయితీ గురించి నగరపాలక సంస్థ సిబ్బంది బకాయిదారులకు అవగాహన కల్పిస్తూ నగరపాలక సంస్థకి బకాయిలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్లో నగరపాలక సంస్థ సిబ్బంది అసిస్టెంట్ కమీషనర్, రెవిన్యూ ఆఫీసర్, అందరూ రెవిన్యూ ఇన్స్పెక్టర్లు, ఇంకా అందరు సచివాలయ సిబ్బంది కూడా ప్రతి రోజు ఉదయం 7:30కి ఫీల్డ్‌లో ఉండి టాక్స్ వసూలు చేస్తున్నారని తెలిపారు. అలానే ప్రతి రోజూ టాక్స్ వసూళ్ల గురించి సచివాలయం వారీగా నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ రివ్యూ తీసుకొంటున్నారని తెలిపారు. ఇలా అందరూ సమిష్టిగా పనిచేయడం వల్లనే ఒక రోజులో కోటి రూపాయలు వసూలు చేయగలిగినట్లు తెలిపారు. అలానే ప్రస్తుతం ఆర్థిక సంవత్సరానికి ఇంకను 6 రోజులు మాత్రమే మిగిలి ఉన్నవి కనుక ఇంకను పన్ను చెల్లించని వారందరూ కూడా పన్ను బకాయిల వడ్డీ పై ప్రభుత్వం వారు అందిస్తున్న 50% రాయితీని సద్వినియోగం చేసుకొని బకాయిలు మొత్తాన్ని నగరపాలక సంస్థకి చెల్లించి ఒంగోలు నగర అభివృద్ధికి సహకరించాల్సిందిగా కమిషనర్ కోరారు. సెలవు రోజులలో కూడా టాక్స్ చెల్లించుట కొరకు నగరపాలక సంస్థ నందు స్పెషల్ కౌంటర్లు ఏర్పాటు చేయడమైనది అని కూడా తెలిపారు. ఈ సమావేశంలో కమిషనర్‌తో అసిస్టెంట్ కమీషనర్ రామ్ భూపాల్‌రెడ్డి, రెవిన్యూ ఆఫీసర్ విజయ భాస్కర్, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.




## ధూళిపాళ్ల నరేంద్ర కుమార్తె వివాహ వేడుకలో ఎమ్మెల్యే ఇంటూరి




(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మార్చి 25)
తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్తె వివాహ వేడుక గుంటూరులోని శ్రీకన్వెన్షన్‌లో బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరై వధూవరులు నాగసాయి వైదీప్తి, కెవిన్ రామ్‌లను పుష్పగుచ్ఛం అందజేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎమ్మెల్యే ధూళిపాల నరేంద్ర కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొన్న కరణం





(షణ్ముఖ వెలుగు, చీరాల, మార్చి 25)
మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం కృష్ణమూర్తి, వైయస్సార్ పార్టీ ఇంచార్జ్ కరణం వెంకటేష్ లు



బుధవారం గుంటూరులో శ్రీ కన్వెన్షన్ నందు పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్తె వైదీప్తి వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా వారు టిడిపి ఎమ్మెల్యేలు, మంత్రులతో కొద్దిగా సేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాటామంతి చేశారు. అనంతరం నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీరి వెంట వివిధ హోదాలలో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

## వైభవంగా అర్చక పురోహితులకు పంచాంగాల పుస్తకాల పంపిణీ



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, మార్చి 25)
కనిగిరి నూతన (పరాభవ నామ) సంవత్సర సందర్భంగా కనిగిరిలోని స్థానిక బ్రాహ్మణ కళ్యాణ మండపంలో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా పంచాంగ పుస్తకాల పంపిణీ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. 'పరాభవ' నామ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని, కనిగిరి నియోజకవర్గానికి చెందిన జాతీయ యువజన కార్యదర్శి సంగరాజు సాయి మనోజ్ ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. సంగరాజు సాయి మనోజ్ జాతీయ స్థాయి పదవిని చేపట్టిన తర్వాత తొలిసారి వచ్చిన సందర్భంగా, కనిగిరి ప్రాంతంలోని అర్చక పురోహితులందరికీ నూతన సంవత్సర పంచాంగాలను అందజేశారు. కేవలం పంచాంగాలే కాకుండా, కంచి కామకోటి పీఠాధిపతులు జగద్గురు శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి మహాస్వామి వారి ప్రత్యేక అనుగ్రహంతో పొందిన ఆధ్యాత్మిక పత్రాలను కూడా స్వామివారి ఆశీస్సులతో పురోహితులకు పంపిణీ చేయడం విశేషం. ఈ సందర్భంగా ప్రముఖ వేద పండితులు వినుపాముల రామకృష్ణ శర్మ సాయి మనోజ్ ను వేద మంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా సత్కరించి, ఆశీర్వచనాలు అందజేశారు. యువకుడైన మనోజ్ జాతీయ స్థాయిలో కీలక పదవిని పొందడం పట్ల కనిగిరి అర్చక సంఘం హర్షం వ్యక్తం చేస్తూ, ఆయనను ఆశీర్వదించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ముఖ్య అతిథులుగా ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ కళ్యాణ మండప చైర్మన్ ధూళిపాళ్ల వీరభద్రరావు, సానికొమ్ము జగన్ మోహన్ రెడ్డి, శివాలయం డైరెక్టర్ సూరపరాజు తులసి, పెద్ద సంఖ్యలో అర్చకులు, పురోహితులు పాల్గొన్నారు. బ్రాహ్మణ సమాజ సంక్షేమానికి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు సాయి మనోజ్ చూపిస్తున్న చొరవను ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమం కనిగిరి బ్రాహ్మణ సేవా సంఘం, స్థానిక ప్రజల ప్రశంసలను అందుకుంది. ఈ కార్యక్రమంలో అర్చకులు, పురోహితులు, పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.